Follow: @ANNTELUGU
17-04-2026
# మహా పత్రిక
శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 110 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



ప్రత్యేక కథనం 4లో

టాప్ న్యూస్

**డీలిమిటేషన్‌పై కవిత వార్నింగ్**
- తెలంగాణ వాటా తగ్గితే భారీ ఉద్యమం



03

**కష్టపడి సంపాదించుకున్న పేరును పోగొట్టుకుంటున్నా..**
- సింగర్ మంగ్లీ



02

**స్టార్ హీరోయిన్ తమన్నాకు..**
- హైకోర్టులో చుక్కెదురు



02

# తెలంగాణ విభజనను పాక్ తో పోల్చిన బీజేపీ ఎంపీ

## పార్లమెంట్ సాక్షిగా తేజస్వీ విద్వేషం

- భగ్గుమన్న తెలంగాణ .. తేజస్వీ వ్యాఖ్యలపై ఫుల్ ఫైర్
- తేజస్వీ సూర్య తెలివిలేని వెధవ మంత్రి పొన్నం ఫైర్
- బీజేపీ నేతలకు తెలంగాణ ఉనికి అంటే కడుపు మంట మంత్రి జూపల్లి భగ్గు
- నీకు ఎంత ధైర్యం తేజస్వీపై కవిత ఫైర్
- తేజస్వీ పార్లమెంట్ వేదికగా క్షమాపణ చెప్పాల్సిందే కేటీఆర్
- సభలో బీఆర్ఎస్ ఎంపీలు ఉంటే తేజస్వీభరతం పట్టేవాళ్ళు మాజీ మంత్రి హరీష్ ఫైర్
- ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టేలా తేజస్వీ వ్యాఖ్యల కాంగ్రెస్ నేత కంది శ్రీనివాసరెడ్డి
- భూతద్దంలో చూడొద్దు బీజేపీ చీఫ్ రామచందర్ రావు



**హైదరాబాద్, మహా:** దేశ అత్యున్నత చట్టసభ వేదికగా, నాలుగుకోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షల ప్రతిరూపమైన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావాన్ని భారత్‌పాకిస్థాన్ విభజనతో పోలుస్తూ బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ ప్రజలు భగ్గుమంటున్నారు. ఉద్యమకారులు, రాజకీయనేతలు, ప్రజాప్రతినిధులు తేజస్వీ జుగుప్సాకర, విద్వేష ప్రసంగంపై భగ్గుమంటున్నారు. డీలిమిటేషన్ బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన నోటి నుంచి వెలువడిన 'విద్వేషపు' పదజాలం తెలంగాణ అస్తిత్వపు మూలాలను తాకింది. తెలంగాణ ప్రజల మనోభావాలు గాయపరిచింది. అమరవీరుల త్యాగాలను అవహేళన చేసేలా రాజకీయ పబ్బం కోసం ఎంపీ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ ప్రజలు భగ్గుమంటున్నారు. ఆరు దశాబ్దాల సుదీర్ఘ పోరాటం, వేలాది మంది యువతీ యువకుల ప్రాణత్యాగాలు, గల్లీ నుంచి దిల్లీ దాకా సాగిన ధర్మయుద్ధం ఫలితంగా మిగతా 2లో



## నీకు ఎంత ధైర్యం..?

**.. తేజస్వి సూర్యపై కవిత నిప్పులు**

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య పార్లమెంట్ వేదికగా చేసిన వ్యాఖ్యలపై మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "నీకు ఎంత ధైర్యం..?" అంటూ ఆమె సోషల్ మీడియా వేదికగా నిలదీశారు. తెలంగాణ అస్తిత్వాన్ని, అమరుల త్యాగాలను కించపరిచేలా మాట్లాడటంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. నిండు పార్లమెంట్‌లో తెలంగాణ ఏర్పాటును అవమానించడం అంటే, తెలంగాణ కోసం పోరాడిన కోట్లాది మంది ప్రజలను అవమానించడమేనని కవిత పేర్కొన్నారు. "ఈ వ్యాఖ్యలు కేవలం రాజకీయమైనవి కావు.. తెలంగాణను సాకారం చేయడానికి తమ ప్రాణాలను త్యాగం చేసిన వేలాది మంది అమరులను అగౌరవపర్చడమే. మా భావోద్వేగాలతో రాజకీయాలు చేయడం సరికాదు" అని ఆమె స్పష్టం చేశారు.

**తేజస్వీ సూర్య తెలివిలేని వెధవ**
.. బీజేపీ ఎంపీపై మంత్రి పొన్నం ఫైర్
వివరాలు 2లో

**బీఆర్ఎస్ ఎంపీలే సభలో ఉంటే...**
తేజస్వి సంగతి తేల్చేవాళ్లు.. మాజీ మంత్రి హరీశ్ రావు
వివరాలు 2లో

# మహిళా ఎంపీలు @272

## పార్లమెంట్‌లో వాడివేడి కోటా పోరు

- 207 ఓట్ల మెజారిటీతో మహిళా బిల్లుకు పచ్చజెండా
- భారత పార్లమెంట్ చరిత్రలో మైలు రాయి
- క్రెడిట్ అందరిదీ అన్న ప్రధాని మోదీ



**ఢిల్లీ, మహా:** భారత పార్లమెంటు చరిత్రలో ఏప్రిల్ 16 ఒక మైలురాయిగా నిలిచిపోతుంది. సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ, మహిళా రిజర్వేషన్ల బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టిన తీరు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు ద్వారా మహిళలకు లోక్‌సభ మరియు రాష్ట్ర శాసనసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ఈ బిల్లులను ప్రవేశపెట్టిన తరుణంలో, సభలో నెలకొన్న వాతావరణం ప్రజాస్వామ్య స్ఫూర్తిని, అదే సమయంలో రాజకీయ వైరుధ్యాలను ప్రతిబింబించింది. ఈ బిల్లు కేవలం మహిళల కోటాకు మాత్రమే పరిమితం కాకుండా, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అనే కీలక అంశంతో ముడిపడి ఉండటమే వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. మిగతా 2లో

### పునర్విభజనపై అనుమానాల మేఘాలు

బిల్లు ప్రవేశపెట్టిన వెంటనే విపక్షాలు తమ నిరసన గళాన్ని విప్పాయి. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కేసీ వేణుగోపాల్ ఈ బిల్లులోని 'నియోజకవర్గాల పునర్విభజన' నిబంధనను తీవ్రంగా ఆక్షేపించారు. మహిళలకు రిజర్వేషన్లు ఇవ్వాలని చిత్తశుద్ధి ఉంటే, దానిని తక్షణమే అమలు చేయాలి తప్ప, పునర్విభజనతో ముడి పెట్టడం వెనుక ప్రభుత్వానికి దురుద్దేశాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. దక్షిణ భారత రాష్ట్రాలకు అన్యాయం జరిగే అవకాశం ఉన్న డీలిమిటేషన్ ప్రక్రియను ఈ బిల్లులో చేర్చడాన్ని ఆయన తప్పుబట్టారు. డీలిమిటేషన్ బిల్లును బేషరతుగా వెనక్కి తీసుకోవాలని, జాప్యం చేయకుండా మహిళా కోటాను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సభలో కాంగ్రెస్ నేతలు లేవనెత్తిన ఈ అంశం ప్రతిపక్షాల ఐక్యతను చాటిచెప్పింది.

**చారిత్రక ఘట్టం.. నారీ శక్తికి పట్టం**
విడదీసే రాజకీయాలు మానుకోండి... క్రెడిట్ అందరిదీ అన్న ప్రధాని మోదీ
వివరాలు 2లో

## అఖిలేష్ యాదవ్ విమర్శలు..
# కుల గణన అస్త్రం

సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ చర్చను మరో మలుపు తిప్పారు. మహిళా సాధికారత అనే ముసుగులో ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం పాకులాడుతోందని ఆయన మండిపడ్డారు. నియోజకవర్గాల పునర్విభజనకు ఇంతటి ఆతృత ఎందుకని ఆయన కేంద్రాన్ని సూటిగా ప్రశ్నించారు. "జనగణన చేపడితే కుల గణన అడుగుతారని భయం.. కుల గణన చేస్తే రిజర్వేషన్ల శాతం పెంచాలని నిలదీస్తారని భయం.. అందుకే ఈ అంకెలు, లెక్కల గారడీతో ప్రజలను తప్పదోవ పట్టిస్తున్నారు" అని అఖిలేష్ ఎద్దేవా చేశారు. సామాజిక న్యాయం జరగాలంటే దేశవ్యాప్తంగా కుల గణన నిర్వహించడం ఒక్కటే మార్గమని, వెనుకబడిన వర్గాలకు సముచిత స్థానం దక్కనప్పుడు ఈ రిజర్వేషన్లకు అర్థం లేదని ఆయన కుండబద్దలు కొట్టారు.



# డీలిమిటేషన్ సెగ

## నల్ల చొక్కా ధరించి నిరసన బాట పట్టిన సీఎం స్టాలిన్

ప్రతిపాదిత విభజన బిల్లును దహనం చేసిన ముఖ్యమంత్రి
జనాభా ప్రాతిపదికన సీట్ల కోతపై స్టాలిన్ ఆగ్రహం



**నామక్కల్,మహా:** తమిళనాడు రాజకీయాల్లో ఒక చారిత్రాత్మకమైన, ఉద్వేగభరితమైన ఘట్టం బుధవారం చోటుచేసుకుంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నియోజకవర్గాల పునర్విభజన (డెలిమిటేషన్) ప్రక్రియకు వ్యతిరేకంగా ముఖ్యమంత్రి , డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ ప్రత్యక్ష యుద్ధాన్ని ప్రకటించారు. నామక్కల్ వేదికగా జరిగిన ఈ భారీ నిరసన ప్రదర్శన దేశవ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో పెను సంచలనాన్ని సృష్టించింది. మిగతా 2లో

# అమరవీరుల బలిదానాన్ని పాకిస్థాన్‌తో పోలుస్తావా?

**ఆత్మగౌరవంపై దాడిని సహించేది లేదు.. తేజస్వీ సూర్యపై కేటీఆర్ ఆగ్రహం**



**హైదరాబాద్, మహా:** పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్‌పాకిస్థాన్ విభజనతో పోలుస్తూ బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉగ్రరూపం దాల్చారు. ఇది కేవలం ఒక రాజకీయ నాయకుడి మాట కాదని, బీజేపీ డీఎన్ఏలోనే నిండి ఉన్న 'తెలంగాణ వ్యతిరేకత'కు నిలువుటద్దమని ఆయన నిప్పులు చెరిగారు. ఆరు దశాబ్దాల పాటు వివక్షకు వ్యతిరేకంగా, నీళ్లు, నిధులు, నియామకాల కోసం పోరాడి, వేలాది మంది మిగతా 2లో

# దక్షిణాది దెబ్బతినదు

**విపక్షాల ప్రచారం అంతా అబద్ధం** | **ఏపీకి 38, తెలంగాణకు 26 స్థానాలు** | **సభలో అమిత్ షా ప్రకటన**



**ఢిల్లీ, మహా:** నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియపై విపక్షాలు చేస్తున్న ప్రచారాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రంగా ఖండించారు. బుధవారం లోక్‌సభలో డీలిమిటేషన్ బిల్లు 2026పై జరిగిన చర్చలో ఆయన సుదీర్ఘ వివరణ ఇచ్చారు. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందంటూ ప్రతిపక్షాలు కావాలనే విద్వేషాలను రెచ్చగొడుతున్నాయని, ఈ బిల్లు వల్ల ఏ ఒక్క రాష్ట్రానికి కూడా ప్రాతినిధ్యం తగ్గదని ఆయన స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాల సంఖ్యను ఏకరీతిన 50 శాతం మేర పెంచబోతున్నామని, దీనివల్ల ప్రస్తుతం ఉన్న రాజకీయ నిష్పత్తిలో ఎలాంటి మార్పు ఉండదని ఆయన భరోసా ఇచ్చారు. దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణ పాటించినందుకు శిక్ష పడుతుందన్న వాదనలో ఏమాత్రం వాస్తవం లేదని, ప్రతి రాష్ట్రం తన ప్రస్తుత ప్రాధాన్యతను అలాగే కొనసాగిస్తుందని ఆయన ఉద్ఘాటించారు. దక్షిణాది రాష్ట్రాల్లో పెరగబోయే సీట్ల వివరాలను అమిత్ షా గణంకాలతో సహా సభ ముందు ఉంచారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 25 లోక్‌సభ స్థానాల మిగతా 2లో

# తేజస్వీ సభ్యత్వం రద్దుచేయాలి

- అమరుల త్యాగాలపై అనుచిత వ్యాఖ్యలా?
- కాంగ్రెస్ నేత కంది శ్రీనివాసరెడ్డి ధ్వజం

**ఆదిలాబాద్, మహా:** తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసిన తేజస్వి సూర్య, తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ ఇన్ ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. ఇలాంటి వ్యాఖ్యలను తెలంగాణ ప్రజలు సహించరని హెచ్చరించారు. తక్షణమే తేజస్వీ సూర్య బేషరతుగా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, ఆయన చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని ఎవరు తక్కువ చేసి మాట్లాడినా ఊరుకునే ప్రసక్తే లేదన్నారు.



## కష్టపడి సంపాదించుకున్న పేరును పోగొట్టుకుంటున్నా

**సింగర్ మంగ్లీ**

**మహా:** గతకొన్ని రోజులుగా సోషల్ మీడియాలో తనపై వస్తున్న మైక్రో ఫైనాన్స్ కుంభకోణం ఆరోపణలపై ప్రముఖ గాయని మంగ్లీ ఒక వివరణాత్మక వీడియోను గురువారం విడుదల చేశారు. ఈ వివాదంపై మంగ్లీ మాట్లాడుతూ.. "మైక్రో ఫైనాన్స్ అనే పదం నాకు ఇంతకు ముందెప్పుడూ తెలియదు. అలాంటిది నేను ఇంత పెద్ద కుట్ర చేశానని అభియోగం రావడం నన్ను, నా వాళ్లను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. నా వృత్తి పాటలు పాడటం, కార్యక్రమాలు చేయడం మాత్రమే. అంతకు మించి నాకు ఎలాంటి వ్యాపారాలు లేవు" అని వివరించారు. "నిజానికి నేను కూడా ఒక బాధితురాలినే. ఈ స్కామ్‌లో డబ్బులు పోగొట్టుకున్న వారు ఆర్థికంగా నష్టపోతే, నేను జీవితాంతం కష్టపడి సంపాదించుకున్న పేరును పోగొట్టుకుంటున్నాను. నా ప్రతిష్టను దెబ్బతీసేందుకు కొందరు కుట్ర పన్నుతున్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు.

## స్టార్ హీరోయిన్ తమన్నాకు హైకోర్టులో చుక్కెదురు

**మహా:** స్టార్ హీరోయిన్ తమన్నా భాటియాకు మద్రాస్ హైకోర్టులో చుక్కెదురు అయింది. ప్రముఖ సబ్బుల తయారీ సంస్థ 'పవర్ సోప్స్' పై ఆమె దాఖలు చేసిన అప్పీల్‌ను, రూ.కోటి నష్టపరిహారం డిమాండ్‌ను న్యాయస్థానం గురువారం కొట్టివేసింది. పవర్ సోప్స్ సంస్థ ఉత్పత్తులకు ప్రచారం కల్పించేందుకు తమన్నా అక్టోబర్ 7, 2008న ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ అగ్రిమెంట్ గడువు అక్టోబర్ 6, 2009తో ముగిసింది. అయితే, ఒప్పంద గడువు తీరిపోయిన తర్వాత కూడా (ముఖ్యంగా నవంబర్ 2010, ఫిబ్రవరి 2011లో తయారైన సబ్బుల కవర్లపై) ఆ సంస్థ తన ఫోటోలను అనధికారికంగా వాడుకుందని తమన్నా ఆరోపించారు. ఈ విషయంపై 2011 జనవరి, ఫిబ్రవరి నెలల్లో సదరు సంస్థకు, వారి కమ్యూనికేషన్ ఏజెన్సీకి నోటీసులు పంపినా వారి నుంచి సరైన సమాధానం రాలేదు. దీంతో తన ఫోటోలను అనుమతి లేకుండా వాడుకున్నందుకు గాను రూ. 1 కోటి నష్టపరిహారం ఇప్పించాలని ఆమె కోర్టును ఆశ్రయించారు. ఈ కేసును విచారించిన సింగిల్ జడ్జి బెంచ్.. సంస్థపై చేసిన ఆరోపణలకు సంబంధించి తమన్నా తగిన సాక్ష్యాలు చూపించలేకపోయారని పేర్కొంటూ గతంలోనే పిటిషన్‌ను కొట్టివేసింది. సింగిల్ జడ్జి ఇచ్చిన ఆ తీర్పును సవాల్ చేస్తూ తమన్నా డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. తాజాగా ఈ అప్పీల్‌ను విచారించిన జస్టిస్ పి. వేల్ మురుగన్, జస్టిస్ కె. గోవిందరాజన్ తిలకవాడిలతో కూడిన ధర్మాసనం.. సింగిల్ జడ్జి తీర్పును సమర్థిస్తూ తమన్నా వేసిన అప్పీల్‌ను శాశ్వతంగా కొట్టివేసింది.

## తేజస్వీ సూర్య తెలివిలేని వెధవ

**.. బీజేపీ ఎంపీపై మంత్రి పొన్నం ఫైర్**

**హైదరాబాద్, మహా:** తెలంగాణ ఏర్పాటును పాకిస్తాన్ విభజనతో పోల్చుతూ లోక్ సభలో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలకు మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్ ఇచ్చారు. తేజస్వీ సూర్య తెలివి లేని వెధవ అని ఘాటు వ్యాఖ్యలతో మండిపడ్డారు. రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన రాష్ట్ర ఏర్పాటుపై అజ్ఞానంగా మాట్లాడారని అతడి సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన పొన్నం.. తేజస్వీ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలన్నారు. తేజస్వీ మాటలపై తెలంగాణ బీజేపీ ఎంపీలు తెలంగాణ బిడ్డలైతే ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఇది ఏ ఒక్కరికో అవమానం కాదని ఇది మన ఉద్యమాన్ని, మన రాష్ట్రాన్ని అమానించడమేనన్నారు. మరొకరు తెలంగాణ ఏర్పాటుపై నోరువిప్పే ధైర్యం చేయకుండా చట్ట ప్రకారం బుద్ధి చెప్పాల్సి ఉందన్నారు. దీనిపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు సమాధానం చెప్పాలన్నారు. తేజస్వీ సూర్యపై చర్య తీసుకోవాలని లోక్‌సభ స్పీకర్ కు లేఖ రాస్తున్నట్లు చెప్పారు.తెలంగాణ తల్లికి అవమానం జరుగుతుంటే బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండటం అంటే తల్లిని అమానించడమేనన్నారు. నాడు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయమంటే పారిపోయిన కిషన్ రెడ్డి ఇవాళ తెలంగాణ తల్లిని అవమానిస్తే మౌనంగా ఉండిపోయారని మండిపడ్డారు. ప్రధాని మోదీ, అమిత్ షా, ఇప్పుడు తేజస్వీ సూర్య తెలంగాణ ఏర్పాటుపై తప్పుడుగా మాట్లాడారని మండిపడ్డారు.

# తెలంగాణ విభజనను పాక్‌తో పోల్చిన బీజేపీ ఎంపీ

(మొదటిపేజీ తరువాయి)

రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన ఒక రాష్ట్ర ఉనికిని.. లక్షలాది మంది రక్తం చిందిన దేశ విభజన నాటి విషాదంతో పోల్చడం కేవలం రాజకీయ అజ్ఞానం మాత్రమే కాదు, అది తెలంగాణ గడ్డపై జరిగిన పవిత్ర ఉద్యమాన్ని ఘోరంగా అవమానించడమేనని మేధావి వర్గం గర్జిస్తోంది. చట్టసభలో కూర్చుని రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రాముఖ్యత తెలియని వ్యక్తి ప్రజాప్రతినిధిగా కొనసాగడం ప్రజాస్వామ్యానికే అవమానమని ఉద్యమకారులు మండిపడుతున్నారు. తేజస్వీ సూర్య వ్యాఖ్యలు వెలువడిన నిమిషాల్లోనే తెలంగాణవ్యాప్తంగా నిరసన జ్వాలలు మిన్నంటాయి. మంత్రి పొన్నం ప్రభాకర్ తేజస్వీపై తీవ్రస్థాయిలో ఫైర్ అవుతూ తెలివి లేని వెధవ అంటూ వ్యాఖ్యానించారు. తెలంగాణను అవమానించిన తేజస్వీపై కేసు నమోదుచేయాలని డీజీపికి లేఖ రాశారు. మరోమంత్రి జూపల్లి క్రిష్ణారావు తేజస్వీసూర్యపై ఫైర్ అయ్యారు. బీజేపీకి మొదటి నుండీ తెలంగాణ ఉనికి అంటే చిన్నచూపు అని ఆగ్రహించారు. బీఆర్ఎస్ పార్టీ అగ్రనేతలు కేటీఆర్, హరీశ్‌రావు, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత భగ్గుమంటున్నారు. . తెలంగాణ అంటే ఒక భౌగోళిక ప్రాంతం మాత్రమే కాదని, అది కోట్లాది మంది ఆత్మ గౌరవ ప్రతీక అని వారు గుర్తుచేశారు. పార్లమెంట్‌లో నాడు ఇదే బీజేపీ మద్దతుతో బిల్లు పాసైనప్పుడు లేని 'పాకిస్థాన్' పోలిక, ఇప్పుడే ఎందుకు గుర్తొచ్చిందని వారు నిలదీస్తున్నారు. 1200 మంది అమరవీరుల చితిమంటల సాక్షిగా ఏర్పడిన రాష్ట్రాన్ని కించపరిచే హక్కు కర్ణాటకకు చెందిన ఎంపీకి ఎవరిచ్చారని హరీశ్‌రావు చేసిన ధ్వజం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. అసలు బీజేపీకి తెలంగాణ ఏర్పాటుపై చిత్తశుద్ధి ఉందా? లేక లోలోపల ఇంకా విషాన్ని దాచుకుంటున్నారా? అన్న అనుమానాలను ఈ వ్యాఖ్యలు బలపరుస్తున్నాయి. కేవలం ఓట్ల రాజకీయాల కోసం ఒక ప్రాంతపు సెంటిమెంట్‌ను అంతర్జాతీయ సరిహద్దు వివాదాలతో పోల్చడం బీజేపీ దిగజారుడుతనానికి పరాకాష్ట అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### ఖబడ్దార్ తేజస్వీ

మరోవైపు, అధికార కాంగ్రెస్ పార్టీ సైతం బీజేపీ ఎంపీ వ్యాఖ్యలపై రణరంగం సృష్టించింది. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అత్యంత ఘాటు పదజాలంతో తేజస్వీ సూర్యను హెచ్చరించడం ప్రాధాన్యం సంతరించుకుంది. 'ఖబడ్దార్' అంటూ ఆయన చేసిన హెచ్చరిక తెలంగాణ సగటు మనిషి ఆగ్రహానికి ప్రతిరూపంగా



నిలిచింది. సోనియా గాంధీ ఇచ్చిన మాట కోసం, రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి తెలంగాణ ఇస్తే.. దానిని అపహాస్యం చేయడం అంటే ప్రజాస్వామ్య స్ఫూర్తిని ఖూనీ చేయడమేనని మంత్రి మండిపడ్డారు. తెలంగాణ బీజేపీ ఎంపీల మౌనాన్ని ఆయన ప్రశ్నిస్తూ.. 'మీ గడ్డను అవమానిస్తుంటే ఢిల్లీ పెద్దల దగ్గర మోకరిల్లుతారా?' అని సంధించిన బాణాలు కమలనాథులను ఆత్మరక్షణలో పడేశాయి. కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ ఇన్ ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తేజస్వీ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. తెలంగాణ ఉద్యమకారుల త్యాగాలను అవమానపరిచేలా వ్యాఖ్యానిస్తే ఇక్కడి ప్రజలు సహించరని, తెలంగాణను అవమానించిన తేజస్వీ వ్యాఖ్యలు.. బీజేపీవా? తేజస్వీవా? చెప్పాలన్నారు. రాష్ట్ర అస్తిత్వంపై దాడి జరుగుతున్నప్పుడు పార్టీలకతీతంగా స్పందించాల్సిన బాధ్యతను బీజేపీ నేతలు విస్మరించడం వారి నైతిక వైఫల్యమని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు.

### తేజస్వీ వ్యాఖ్యలు బీజేపీ ప్లానేనా?

తేజస్వీ సూర్య ఈ వ్యాఖ్యలను డీలిమిటేషన్ చర్చలో భాగంగా చేయడం వెనుక ఒక పక్కా వ్యూహం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి. దక్షిణాది రాష్ట్రాల గళాన్ని నొక్కేయడానికి, ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ విభజనను ఒక అపరాధంగా చిత్రించడానికి బీజేపీ ప్రయత్నిస్తోందా అన్న అనుమానాలు బలపడుతున్నాయి. తెలంగాణ ఏర్పాటు సాఫీగా జరగలేదని ప్రధాని మోదీ గతంలో అన్న మాటలకు, ఇప్పుడు తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలకు పొంతన కుదురుతోంది. ఒకవైపు దక్షిణాదికి అన్యాయం జరగదని అమిత్ షా భరోసా ఇస్తుంటే, మరోవైపు అదే పార్టీ ఎంపీ ఇక్కడి ఆత్మగౌరవాన్ని కాలరాసేలా మాట్లాడటం ఆ పార్టీ ద్వంద్వ వైఖరిని ఎండగడుతోంది. తెలంగాణ గడ్డపై పుట్టిన ప్రతి బిడ్డను 'దేశ విభజన' బాధితుడిగా చిత్రీకరించే ప్రయత్నం చేయడం అంటే చరిత్రను వక్రీకరించడమేనని మేధావులు మండిపడుతున్నారు. ఉద్యమకారులు, విద్యార్థి సంఘాలు సైతం ఈ వ్యవహారంపై ఉగ్రరూపం దాల్చాయి. ఉస్మానియా విశ్వవిద్యాలయం సాక్షిగా గర్జించిన గొంతుకలు.. బీజేపీ ఎంపీకి తెలంగాణ చరిత్రను బోధించాల్సిన సమయం వచ్చిందని హెచ్చరిస్తున్నాయి. నీళ్లు, నిధులు, నియామకాల కోసం సాగిన పోరాటాన్ని సామాజిక విచ్ఛిన్నంగా అభివర్ణించడం వారి అహంకారానికి నిదర్శనమని ఉద్యమనేతలు ధ్వజమెత్తుతున్నారు. తేజస్వీ సూర్య వ్యాఖ్యలు కేవలం ఒక వ్యక్తి మాటలు కాదని, దక్షిణాదిపై ఉత్తరాది భావజాలం చేస్తున్న దాడిగా వారు పరిగణిస్తున్నారు. తక్షణమే బీజేపీ అగ్రనాయకత్వం ఈ విషయంలో క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో తెలంగాణ గడ్డపై ఆ పార్టీకి పుట్టగతులు ఉండవని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. మొత్తం మీద, పార్లమెంట్ సాక్షిగా రేగిన ఈ 'చిల్లర' వ్యాఖ్యల చిచ్చు.. తెలంగాణలో రాజకీయ పునరేకీకరణకు, అస్తిత్వ పోరాటానికి మరోసారి వేదికగా మారుతోంది. ఈ ఇష్యూ రానున్న రోజుల్లో బీజేపీకి పెను శాపంగా మారే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# మహిళా ఎంపీలు @ 272

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిపక్షాల విమర్శలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా అత్యంత చాకచక్యంగా, తార్కికంగా స్పందించారు. కుల గణన విషయంలో విపక్షాలు చేస్తున్న ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. దేశవ్యాప్తంగా జనగణన ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, అది కేవలం లెక్కలు తేల్చే ప్రక్రియ మాత్రమే కాదని, సామాజిక సమతుల్యతను కాపాడే ప్రయత్నమని ఆయన వివరించారు. "కుల గణనతో పాటే జనగణన జరుగుతుందనే విషయాన్ని ప్రతిపక్ష నేతలు విస్మరించినట్లున్నారు" అని ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ప్రస్తుతం గృహ గణన పనులు వేగంగా జరుగుతున్నాయని, ప్రధాన గణన సమయంలో అవసరమైన అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంటామని సభకు హామీ ఇచ్చారు.ముఖ్యంగా ముస్లిం మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలన్న అఖిలేష్ యాదవ్ డిమాండ్‌పై అమిత్ షా కౌంటర్ ఇస్తూ, మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేశారు. "రాజ్యాంగ నిర్మాతలు మతపరమైన రిజర్వేషన్లను ఎప్పుడూ ప్రోత్సహించలేదు. ఒక వర్గాన్ని ప్రసన్నం చేసుకోవడం కోసం రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీయలేం" అని ఆయన గంభీరంగా ప్రకటించారు. ఒకవేళ ఎస్పీ పార్టీకి ముస్లిం మహిళలపై అంతటి ప్రేమే ఉంటే, వారు తమ పార్టీ తరపున ఇచ్చే 33 శాతం టికెట్లను వారికే ఇచ్చుకోవచ్చని, దానికి చట్టంతో పనిలేదని అమిత్ షా చేసిన వ్యాఖ్యలు సభలో నవ్వులు పూయించడమే కాకుండా, విపక్షాలను ఆలోచనలో పడేశాయి.



### సంఖ్యాబలమే శిరోధార్యం

బిల్లు ప్రవేశంపై సమ్మతి తెలియజేయడానికి ముందే, సభలో నెలకొన్న ఉద్రిక్తతల దృష్ట్యా విపక్షాలు 'డివిజన్' (ఓటింగ్) కోరాయి. కాంగ్రెస్, ఎస్పీ, టీఎంసీ, ఆర్ఎస్పీ, డీఎంకే, ఎంఐఎం, సీపీఎం వంటి పార్టీలు ముక్తకంఠంతో బిల్లులోని కొన్ని నిబంధనలను వ్యతిరేకించాయి. స్పీకర్ ఓం బిర్లా విపక్షాల డిమాండ్‌కు అంగీకరించి ఓటింగ్ నిర్వహించారు. ఈ ప్రక్రియ అత్యంత ఉత్కంఠభరితంగా సాగింది. దేశం మొత్తం పార్లమెంట్ వైపు చూస్తున్న తరుణంలో, ఓటింగ్ ఫలితాలు వెలువడ్డాయి. బిల్లు ప్రవేశానికి అనుకూలంగా 207 ఓట్లు రాగా, వ్యతిరేకంగా 126 ఓట్లు పడ్డాయి. దీంతో స్పష్టమైన మెజారిటీతో 131వ రాజ్యాంగ సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టేందుకు లైన్ క్లియర్ అయింది. ఇది అధికార పక్షానికి లభించిన నైతిక విజయంగా భావించవచ్చు.

## సామాజిక, రాజకీయ విశ్లేషణ

**ఈ బిల్లు ప్రవేశపెట్టడం వెనుక కేవలం మహిళా ఓట్లను ఆకర్షించే ప్రయత్నం మాత్రమే కాకుండా, దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే సత్తా ఉంది. అయితే, నియోజకవర్గాల పునర్విభజన అనేది రాబోయే రోజుల్లో పెద్ద సవాలుగా మారనుంది. 2026 తర్వాత జరిగే పునర్విభజన ప్రక్రియలో ఉత్తర భారత రాష్ట్రాలకు సీట్లు పెరిగే అవకాశం ఉండటం, జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణ భారత రాష్ట్రాలకు ప్రాతినిధ్యం తగ్గుతుందనే ఆందోళనను ప్రభుత్వం ఏ విధంగా పరిష్కరిస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది. అఖిలేష్ యాదవ్ లేవనెత్తిన 'కోటాలో కోటా' డిమాండ్ వెనుక ఉన్న సామాజిక సమీకరణలు కూడా తక్కువ అంచనా వేయలేం. ముస్లిం మహిళల ప్రాతినిధ్యంపై చర్చ భవిష్యత్తులో మరింత తీవ్రమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. మొత్తానికి, 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభ మెట్లెక్కింది. ఇది ఒక సుదీర్ఘ ప్రయాణానికి ఆరంభం మాత్రమే. బిల్లులోని నిబంధనలు, పునర్విభజన ప్రక్రియ, కుల గణన డిమాండ్లు రాబోయే రోజుల్లో పార్లమెంటులో మరిన్ని వేడివేడి చర్చలకు దారితీయనున్నాయి. మహిళలకు చట్టసభల్లో సముచిత స్థానం దక్కాలన్న సంకల్పం నెరవేరాలంటే రాజకీయ వైషమ్యాలను పక్కన పెట్టి, సమగ్రమైన చర్చ జరగాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం తన మెజారిటీతో బిల్లును ప్రవేశపెట్టినప్పటికీ, విపక్షాల ఆందోళనలను పరిగణనలోకి తీసుకున్నప్పడే నిజమైన ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. దేశ మహిళా లోకం ఆశగా ఎదురుచూస్తున్న ఈ రిజర్వేషన్ ఫలాలు ఎప్పటికి అందుతాయో వేచి చూడాలి.**

# అమరవీరుల బలిదానాన్ని పాకిస్థాన్‌తో పోలుస్తావా?

## ఆత్మగౌరవంపై దాడిని సహించేది లేదు.. తేజస్వీ సూర్యపై కేటీఆర్ ఆగ్రహం

(మొదటిపేజీ తరువాయి)

బిడ్డల ప్రాణత్యాగాల పునాదులపై నిర్మించుకున్న తెలంగాణ ఆత్మగౌరవాన్ని.. రక్తం చిందిన దేశ విభజన నాటి విషాదంతో పోల్చడం బీజేపీ మూర్ఖత్వానికి పరాకాష్ట అని కేటీఆర్ అభివర్ణించారు. స్వయంగా ప్రధాని మోదీ నుంచి మొదలుకొని గల్లీ నేతల వరకు ప్రతి ఒక్కరూ తెలంగాణ ఏర్పాటుపై విషం కక్కుతూనే ఉన్నారని, ఈ అవమానాన్ని తెలంగాణ సమాజం ఎన్నటికీ మర్చిపోదని ఆయన హెచ్చరించారు.తెలంగాణ రాష్ట్రం అనేది ఎవరి దయాదాక్షిణ్యాల వల్లనో, దిల్లీ సుల్తానులు వేసిన భిక్ష వల్లనో ఏర్పడింది కాదని కేటీఆర్ అత్యంత పదునైన పదజాలంతో స్పష్టం చేశారు. ఒక తరం నుంచి మరో తరానికి అందిన ఉద్యమ స్ఫూర్తితో, ప్రజాస్వామ్యబద్ధంగా సాగిన మహోద్యమ ఫలితమే ఈ గడ్డ విముక్తి అని ఆయన గుర్తు చేశారు. అస్తిత్వం కోసం ప్రజలు చేసిన పవిత్ర పోరాటాన్ని దేశ విభజన లాంటి అరాచక ఘటనతో పోల్చడం అంటే తెలంగాణ చరిత్రను, అమరవీరుల బలిదానాన్ని వెక్కిరించడమేనని ఆయన మండిపడ్డారు. తెలంగాణపై బీజేపీకి ఉన్న కడుపుమంట ప్రతి సందర్భంలోనూ బయటపడుతోందని, ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడంలో బీజేపీకి సాటిలేదని దుయ్యబట్టారు. తేజస్వీ సూర్య చేసిన ఈ పాపం కేవలం ఆయన వ్యక్తిగతమైనది కాదని, ఇది బీజేపీ పార్టీ అధికారిక విధానంగానే తాము పరిగణిస్తున్నామని కేటీఆర్ కుండబద్దలు కొట్టారు.ఈ మొత్తం వ్యవహారంలో తెలంగాణకు చెందిన బీజేపీ ఎంపీల తీరుపై కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పార్లమెంట్‌లో తమ కళ్ల ముందే తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరుస్తున్నా, రాష్ట్ర అస్తిత్వాన్ని అవమానిస్తున్నా నోరు విప్పని ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు అసలు తెలంగాణ బిడ్డలేనా అని ఆయన నిలదీశారు. తమ రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర గౌరవాన్ని దిల్లీ వీధుల్లో తాకట్టు పెట్టారని, ఇలాంటి వారికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కనీసం కాంగ్రెస్ ఎంపీలు సైతం ఈ అడ్డగోలు వ్యాఖ్యలను అడ్డుకోలేకపోవడం దౌర్భాగ్యమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీలుగా గెలిచి దిల్లీలో మౌనముని వ్రతం పట్టడం అంటే తెలంగాణ ప్రజల తీర్పును వెన్నుపోటు పొడవడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే దిల్లీ గద్దెపై ఉన్న తమ యజమానుల మెప్పు పొందేందుకే ఈ ఎంపీలు ప్రాధాన్యత ఇస్తున్నారని మండిపడ్డారు.తక్షణమే తేజస్వీ సూర్య బేషరతుగా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, ఆయన చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కేవలం సూర్య మాత్రమే కాదు, ఈ వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ బీజేపీ పార్టీ కూడా బహిరంగ క్షమాపణ కోరాలని ఆయన భీష్మించారు. తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని ఎవరు తక్కువ చేసి మాట్లాడినా ఊరుకునే ప్రసక్తే లేదని, ఈ విద్వేష రాజకీయాలకు చరమగీతం పాడే వరకు తమ పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ గుండెపై తన్నిన ప్రతి బీజేపీ నేతకు ఈ గడ్డపై తిరిగే అర్హత లేదని, అమరవీరుల ఆత్మఘోష వారిని వదలదని కేటీఆర్ చేసిన గర్జన ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. ఈ సెన్సేషనల్ ఇష్యూ రాబోయే రోజుల్లో బీజేపీని తెలంగాణలో రాజకీయంగా సమాధి చేయడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు. కేటీఆర్ సంధించిన ఈ విమర్శనాస్త్రాల నేపథ్యంలో, తెలంగాణ ఆత్మగౌరవం కోసం మళ్ళీ ఉద్యమ జెండా ఎత్తాల్సిన అవసరం ఉందన్న చర్చ రాష్ట్రవ్యాప్తంగా మొదలైంది. బీజేపీ క్షమాపణ చెబుతుందా లేక ఈ విద్వేషపు నిప్పుల వర్షం కొనసాగుతుందా అన్నది ఇప్పుడు అత్యంత ఆసక్తికరంగా మారింది.

### బీఆర్ఎస్ ఎంపీలే సభలో ఉంటే తేజస్వి సంగతి తేల్చేవాళ్లు: మాజీ మంత్రి హరీశ్ రావు

**హైదరాబాద్, మహా :** ఇవాళ బీఆర్ఎస్ ఎంపీలే సభలో ఉండి ఉంటే తేజస్వి సూర్య సంగతి తేల్చేవారని మాజీమంత్రి హరీష్‌రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్‌పాకిస్థాన్ విభజనతో పోల్చుతూ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పార్లమెంట్ వేదికగా నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచిన తేజస్వి సూర్య, వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. దశాబ్దాల పోరాటం, వేలాది మంది యువతీ యువకుల త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణను, రక్తపాతంతో కూడిన విభజనతో పోల్చడం అమరవీరుల త్యాగాలను అవమానించడమేనని మండిపడ్డారు. తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ రాజ్యాంగబద్ధంగా జరిగిందని గుర్తుచేసిన హరీశ్ రావు... ఈ రాష్ట్రం నేడు దేశానికే ఆదర్శంగా నిలవడాన్ని బీజేపీ జీర్ణించుకోలేకపోతోందని విమర్శించారు. ఒకవేళ తెలంగాణ ఏర్పాటు భారత్‌పాక్ విభజన వంటిదే అయితే, ఆనాడు పార్లమెంట్‌లో బీజేపీ ఈ బిల్లుకు ఎందుకు మద్దతు ఇచ్చిందని ఆయన సూటిగా ప్రశ్నించారు.

# డీలిమిటేషన్ సెగ

## నల్ల చొక్కా ధరించి నిరసన బాట పట్టిన సీఎం స్టాలిన్

## ప్రతిపాదిత విభజన బిల్లును దహనం చేసిన ముఖ్యమంత్రి

## జనాభా ప్రాతిపదికన సీట్ల కోతపై స్టాలిన్ ఆగ్రహం

(మొదటిపేజీ తరువాయి)

ఈ నిరసన కార్యక్రమంలో అత్యంత కీలకమైన , ఉద్రిక్తతకు దారితీసిన అంశం ఏమిటంటే.. ప్రతిపాదిత డెలిమిటేషన్ బిల్లు ప్రతిని ముఖ్యమంత్రి స్టాలిన్ స్వయంగా దహనం చేయడం. ఒక రాష్ట్రానికి బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి, కేంద్రం తీసుకువస్తున్న చట్టానికి వ్యతిరేకంగా ఈ స్థాయి నిరసన తెలపడం వెనుక ఉన్న లోతైన ఆవేదనను రాజకీయ విశ్లేషకులు గమనిస్తున్నారు. "తమిళనాడు ప్రయోజనాలను దెబ్బతీసే ఏ శక్తిని అయినా మేము అడ్డుకుంటాం" అని నినదిస్తూ ఆయన బిల్లును తగులబెట్టడం, కేంద్రరాష్ట్ర సంబంధాల్లో కొత్త మలుపును సూచిస్తోంది. దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ఉనికిని దెబ్బతీసే కుట్రలను సహించేది లేదని ఆయన ఈ చర్య ద్వారా స్పష్టమైన హెచ్చరిక పంపారు.డెలిమిటేషన్ ప్రక్రియ వల్ల తమిళనాడు వంటి అభివృద్ధి చెందిన రాష్ట్రాలకు జరుగుతున్న అన్యాయాన్ని స్టాలిన్ తన ప్రసంగంలో బలంగా వినిపించారు. దశాబ్దాలుగా కేంద్రం సూచించిన కుటుంబ నియంత్రణ పద్ధతులను పాటించి, జనాభాను నియంత్రించడంలో అగ్రస్థానంలో నిలిచిన తమిళనాడుకు.. ఇప్పుడు అదే జనాభా ప్రాతిపదికన పార్లమెంట్ సీట్లు తగ్గించడం అంటే రాష్ట్ర అభివృద్ధిని శిక్షించడమేనని ఆయన వాదించారు. ఉత్తరాది రాష్ట్రాలలో జనాభా పెరుగుదల కారణంగా అక్కడ సీట్లు పెరిగి, దక్షిణాదిలో సీట్లు తగ్గితే పార్లమెంట్‌లో మా గొంతుక మూగబోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది సమాఖ్య స్ఫూర్తిని తుంగలో తొక్కి, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని ఆయన విమర్శించారు.నామక్కల్ సాక్షిగా జరిగిన ఈ నిరసన కేవలం తమిళనాడుకు మాత్రమే పరిమితం కాదని, ఇది మొత్తం దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి సమస్య అని స్టాలిన్ గుర్తుచేశారు. ఈ పోరాటంలో ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను కూడా కలుపుకుని ముందుకు వెళ్తామని, కేంద్రం తన మొండి వైఖరిని వీడే వరకు విశ్రమించబోమని ఆయన ప్రకటించారు. ముఖ్యమంత్రి చేపట్టిన ఈ ప్రత్యక్ష పోరాటంతో డీఎంకే శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు ఉధృతం చేసేందుకు సిద్ధమవుతున్నాయి. ఈ పరిణామం రాబోయే రోజుల్లో కేంద్ర , దక్షిణాది రాష్ట్రాల మధ్య రాజకీయ ఘర్షణను మరింత తీవ్రం చేసే అవకాశముంది.



## చారిత్రక ఘట్టం..

# నారీ శక్తికి పట్టం

### విడదీసే రాజకీయాలు మానుకోండి

### క్రెడిట్ అందరిదీ అన్న ప్రధాని మోదీ

**ఢిల్లీ, మహా:** భారత ప్రజాస్వామ్య దేవాలయం లోక్‌సభలో మరో సువర్ణ అధ్యాయం ఆవిష్కృతమైంది. మహిళా రిజర్వేషన్ల అమలు కోసం ప్రభుత్వం ప్రతిపాదించిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై జరిగిన చర్చలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొని చారిత్రక ప్రసంగం చేశారు. దేశ పార్లమెంటరీ చరిత్రలో ఈ రోజును ఎప్పటికీ మర్చిపోలేమని, వికసిత్ భారత్ (అభివృద్ధి చెందిన భారత్) లక్ష్య సాధనలో మహిళల పాత్ర అత్యంత కీలకమని ఆయన ఉద్ఘాటించారు. మహిళలకు సరైన అవకాశం కల్పిస్తే, వారు దేశాన్ని సరికొత్త పురోగతి బాటలో నడిపిస్తారని ప్రధాని కొనియాడారు. ఈ చారిత్రక పరిణామంలో భాగస్వామి కావడం తన అదృష్టంగా భావిస్తున్నానని చెబుతూ, రాజకీయాలకు అతీతంగా అందరూ ఈ బిల్లుకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. "మహిళా బిల్లును వ్యతిరేకించే వారిని ఈ దేశ మహిళలు ఎప్పటికీ క్షమించరు" అని ఆయన గంభీరంగా హెచ్చరించారు. గత ముప్పై ఏళ్లలో ఎప్పుడెప్పుడు మహిళా కోటా చర్చకు వచ్చిందో, ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ఈ హక్కును అడ్డుకున్న వారికి మహిళలు తగిన బుద్ధి చెప్పారని ఆయన గుర్తు చేశారు. 2024 ఎన్నికల్లో ఈ అంశం వివాదాస్పదం కాకపోవడానికి కారణం అందరూ ఏకాభిప్రాయంతో ఉండటమేనని, ఈ రోజు కూడా అదే స్ఫూర్తితో అందరూ కలిసి నిర్ణయం తీసుకుంటే అది ఏ ఒక్క పార్టీ విజయం కాకుండా, భారత ప్రజాస్వామ్యానికే గర్వకారణంగా మారుతుందని ఆయన స్పష్టం చేశారు.ఇక ఈ బిల్లుతో ముడిపడి ఉన్న నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)పై నెలకొన్న ఆందోళనలను ప్రధాని అత్యంత స్పష్టంగా నివృత్తి చేశారు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. "డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదు.. ఇది నా హామీ" అని ఆయన ప్రకటించారు. ఉత్తరాది, దక్షిణాది అంటూ దేశాన్ని విభజించే రాజకీయాలు చేసే కాలం చెల్లిపోయిందని, అటువంటి వారిని ప్రజలు ఇప్పటికే దూరం పెట్టారని ఆయన ఆరోపించారు. తమ ప్రభుత్వానికి చిన్న రాష్ట్రం, పెద్ద రాష్ట్రం అనే భేదాలు లేవని, ప్రతి ప్రాంతానికి న్యాయం చేయడమే తమ వాగ్దానమని ఆయన పునరుద్ఘాటించారు. సాంకేతిక కారణాలు చూపిస్తూ మూడు దశాబ్దాల పాటు మహిళల హక్కులను కాలరాశారని, ఆ అన్యాయాన్ని సరిదిద్దే సమయం ఇప్పుడు ఆసన్నమైందని ఆయన పేర్కొన్నారు. మహిళా బిల్లు విషయంలో ఏ పార్టీకి కూడా క్రెడిట్ దక్కకూడదనేది తన ఉద్దేశం కాదని ప్రధాని మోదీ ప్రకటించారు.

# దక్షిణాది దెబ్బతినదు

(మొదటిపేజీ తరువాయి)

సంఖ్య 38కి పెరుగుతుందని, అలాగే తెలంగాణలో 17 సీట్లు కాస్తా 26కి చేరుతాయని ఆయన వెల్లడించారు. తమిళనాడులో ప్రస్తుతమున్న 39 స్థానాలు 59కి, కర్ణాటకలో 28 స్థానాలు 42కి పెరుగుతాయని వివరించారు. మొత్తంగా దక్షిణాది రాష్ట్రాల్లోని ఎంపీ సీట్ల సంఖ్య 129 నుంచి 195కి పెరుగుతుందని, ఇది దక్షిణాది ప్రాతినిధ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. సీట్లు పెరుగుతున్నాయే తప్ప ఎక్కడా తగ్గడం లేదని, అలాంటప్పుడు అన్యాయం ఎక్కడ జరుగుతుందో విపక్షాలే సమాధానం చెప్పాలని ఆయన నిలదీశారు. బీజేపీ దక్షిణాదికి వ్యతిరేకమంటూ ముద్ర వేయాలని చూస్తున్న శక్తులకు ఈ గణాంకాలే సమాధానమని ఆయన మండిపడ్డారు. రాజ్యాంగబద్ధంగా జరిగే ఈ ప్రక్రియలో రాష్ట్రాల వాటా నిష్పత్తిని అమిత్ షా శాస్త్రీయంగా వివరించారు.



ఉదాహరణకు, ప్రస్తుత 543 స్థానాల్లో ఆంధ్రప్రదేశ్ వాటా 4.60 శాతంగా ఉంటే, సీట్ల పెంపు తర్వాత కూడా అదే 4.60 శాతం వాటా కొనసాగుతుందని చెప్పారు. అలాగే తెలంగాణ వాటా ప్రస్తుతం ఉన్న 3.30 శాతమే భవిష్యత్తులోనూ ఉంటుందని క్లారిటీ ఇచ్చారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో 50 శాతం మేర సీట్లు పెంచడం వల్ల ఏ రాష్ట్రం కూడా తన ప్రాముఖ్యతను కోల్పోదని, ఇది అత్యంత పారదర్శకమైన విధానమని ఆయన పేర్కొన్నారు. ప్రతిపక్షాలు కేవలం రాజకీయ పబ్బం గడుపుకోవడానికి, ఉత్తరదక్షిణ విభేదాలను సృష్టించడానికి ఈ అంశాన్ని వాడుకుంటున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి చెందిన రాష్ట్రాలను తక్కువ చేయడం కేంద్ర ప్రభుత్వ ఉద్దేశం కాదని, ప్రజాస్వామ్యంలో ప్రాతినిధ్యాన్ని మరింత విస్తృతం చేయడమే ఈ బిల్లు ప్రధాన లక్ష్యమని హోంమంత్రి స్పష్టం చేశారు. డీలిమిటేషన్ బిల్లుతో దేశంలోని ప్రతి పౌరుడికి, ప్రతి ప్రాంతానికి న్యాయం జరుగుతుందని ఆయన హామీ ఇచ్చారు. అశాస్త్రీయ వాదనలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలని విపక్షాలకు హితవు పలికారు. 2026 నాటి ఈ చారిత్రక సంస్కరణ ద్వారా భారత పార్లమెంటరీ వ్యవస్థ మరింత శక్తివంతంగా మారుతుందని, ప్రాంతీయ ఆకాంక్షలకు చట్టసభల్లో సముచిత స్థానం లభిస్తుందని అమిత్ షా తన ప్రసంగం ద్వారా దేశ ప్రజలకు భరోసా కల్పించారు.

# డీలిమిటేషన్‌పై కవిత వార్నింగ్

**హైదరాబాద్, మహా:** పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో సభ ముందుకు కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లులను తీసుకొస్తుంది. ఈ బిల్లులపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కేంద్ర ప్రభుత్వానికి స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. దేశవ్యాప్తంగా నియోజకవర్గాల సంఖ్య పెంచే ప్రక్రియలో తెలంగాణ రాజకీయ ప్రాతినిధ్యం తగ్గితే సహించేది లేదని, తెలంగాణ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తే ప్రజలు రోడ్ల పైకి వస్తారని ఆమె హెచ్చరించారు. ప్రస్తుతం పార్లమెంట్‌లో తెలంగాణ ప్రాతినిధ్యం 3.13 శాతంగా ఉందని, ఇది అత్యంత కనిష్ట స్థాయి అని కవిత పేర్కొన్నారు. "పునర్విభజన తర్వాత కూడా పార్లమెంట్‌లో తెలంగాణకు కనీసం 3.13 శాతం ప్రాతినిధ్యం ఉండాలి. దీనిని మా రాష్ట్రానికి కనిష్ట స్థాయి గా పరిగణించాలి. అంతకంటే ఒక్క శాతం తగ్గినా తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసినట్లే" అని ఆమె స్పష్టం చేశారు. కేంద్రం ప్రతిపాదిస్తున్న 50 శాతం సీట్ల పెరుగుదల పైకి సానుకూలంగా కనిపిస్తున్నా, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణకు వచ్చే సీట్ల మధ్య వ్యత్యాసం చాలా ఎక్కువగా ఉందని, ఇది ప్రాంతీయ అసమానతలకు దారితీస్తుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టడంపై కవిత తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "మహిళా బిల్లును డీలిమిటేషన్‌తో కాకుండా, ఓబీసీ రిజర్వేషన్ల బిల్లుతో ముడిపెట్టాలి. 33 శాతం రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు తగిన వాటా కల్పిస్తేనే నిజమైన సామాజిక న్యాయం జరుగుతుంది" అని డిమాండ్ చేశారు.

# చిన్న దృష్టిలోపం కూడా పెద్ద ప్రమాదాలకు కారణమవుతుంది

- జిల్లా కలెక్టర్ అంకిత్
- ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** చిన్న దృష్టిలోపం కూడా పెద్ద ప్రమాదాలకు కారణమవుతుందని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. రహదారుల భద్రత వారోత్సవం కార్యక్రమంలో భాగంగా కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో డ్రైవర్లకు నిర్వహిస్తున్న ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డ్రైవర్లకు కంటి పరీక్షలు అత్యంత ముఖ్యమని కంటి చూపు స్పష్టంగా లేకపోతే రహదారులపై ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అన్నారు. ప్రతి డ్రైవర్ తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించి నిర్దిష్ట కాల వ్యవధిలో కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రోడ్డు భద్రత నిబంధనలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న ఉచిత కంటి పరీక్షా కార్యక్రమాలను డ్రైవర్లు సద్వినియోగం చేసుకోవాలని తమ కంటి చూపును అశ్రద్ధ చేయకుండా సమీపంలో నిర్వహించే శిబిరాల్లో పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కంటి సమస్యలను ముందుగానే గుర్తించి చికిత్స పొందడం ద్వారా డ్రైవర్లు సురక్షితంగా వాహనాలు నడపగలరని తద్వారా తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా రక్షించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ఆటో డ్రైవర్లలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు రహదారులపై భద్రతా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది ప్రతి ఒక్కరికీ నాణ్యమైన సేవలు అందించి అవసరమైన వారికి వెంటనే కళ్లద్దాలు చికిత్స అందించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ అధికారి తుకారాం రాథోడ్, కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ రాధ రామ్మోహన్, వైద్యులు నర్సులు సిబ్బంది పాల్గొన్నారు.



# రోడ్డు భద్రతకు కంటి వెలుగు..

**డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం..**
**ప్రారంభించిన మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి..**

**మణుగూరు, మహా :** ప్రజా పాలన 99 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మణుగూరు సబ్‌డివిజన్ పోలీసులు రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేకంగా గురువారం కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి డ్రైవర్ల నుంచి విశేష స్పందన లభించింది. సుమారు 200 మందికి పైగా ఆటో, లారీ, కార్ డ్రైవర్లు హాజరై తమ కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా వైద్యులు డ్రైవర్లకు కంటి ఆరోగ్యంపై సూచనలు అందిస్తూ, సమయానుకూలంగా పరీక్షలు చేయించుకోవడం రోడ్డు ప్రమాదాలను నివారించడంలో కీలకమని వివరించారు. కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే చికిత్స పొందాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోడ్డు భద్రతలో డ్రైవర్ల పాత్ర



అత్యంత ముఖ్యమని, ఆరోగ్యకరమైన దృష్టి ఉండడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏడూళ్ళ బయ్యారం, అశ్వాపురం, మణుగూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, మణుగూరు ఎస్సైతో పాటు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గౌరీ ప్రసాద్, ఆప్తాల్మిక్ ఆఫీసర్ జి సంజీవరావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దాలి

**జిల్లా కలెక్టర్ అంకిత్**




**జూలూరుపాడు, మహా:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జూలూరుపాడు రైతు వేదికలో గురువారం మండల స్థాయి సభను నిర్వహించారు. ఈ సభలో జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభంలో రాష్ట్ర గీతాన్ని ఆలపించగా, అనంతరం ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించి సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలో రహదారుల భద్రత, అర్రైవ్ అ లైవ్, వ్యవసాయ శాఖ, విద్యాశాఖ, వైద్య శాఖ, మిషన్ భగీరథ, ఇరిగేషన్, మహిళ సంఘాలు వంటి వివిధ శాఖల ద్వారా అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల వివరాలను అధికారులు సభలో తెలియజేశారు. అనంతరం సర్పంచులు తమ గ్రామాలలో నెలకొన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయిలలో సమస్యలను గుర్తించి పరిష్కరించే ప్రక్రియ వేగవంతమవుతోందన్నారు. ఇప్పటికే గ్రామసభలు నిర్వహించడం, సర్పంచులకు శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేసినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో అధికారులు విధులు సమర్థంగా నిర్వహిస్తేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు క్షేత్రస్థాయిలో సమగ్ర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులు ముందస్తుగా బుకింగ్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో నిర్దేశిత మెనూను కచ్చితంగా పాటించేలా పాఠశాలల్లో పర్యవేక్షణ పెంచాలని తెలిపారు. వేసవి సెలవుల్లో విద్యను మధ్యలో ఆపివేసిన (డ్రాప్‌అవుట్) విద్యార్థులను గుర్తించి తిరిగి పాఠశాలలో చేర్చే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని, వేసవి తీవ్రత దృష్ట్యా ప్రధాన కూడళ్లలో, కార్యాలయాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు గ్రామ స్థాయిలో ప్రజలకు సేవలు అందించేలా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. చేయూత వంటి సంక్షేమ పథకాల అమలులో అర్హులైన వారికి మాత్రమే లబ్ధి చేకూరేలా కట్టుదిట్టమైన పర్యవేక్షణ అవసరమని అన్నారు. గ్రామ స్థాయిలో పంచాయతీ వ్యవస్థ కీలకమని, సర్పంచులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు బాధ్యతాయుతంగా వ్యవహరించి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి సంవత్సరం మోడల్ గ్రామపంచాయతీలను ఎంపిక చేస్తున్న నేపథ్యంలో ప్రతి గ్రామాన్ని మోడల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. రహదారి భద్రతపై గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, వినూత్న ఆలోచనలతో ప్రమాదాలను నివారించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అనంతారం గ్రామంలో భూగర్భ జలాల్లో అధిక ఫ్లోరైడ్ సమస్య కారణంగా కిడ్నీ సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని, ప్రజా ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీని పై స్పందించిన కలెక్టర్, గ్రామానికి సురక్షితమైన మంచినీటి సరఫరా కల్పించే దిశగా మిషన్ భగీరథ అధికారులను తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తాసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ తాళ్లూరి రవి, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ సెక్రెటరీ లు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**తాగునీటి సమస్యలపై పరిశీలన**

**జూలూరుపాడు, మహా:** మండల కేంద్రంలోని సొసైటీ ఆవరణంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో మాయిశ్చర్ మిషన్, తూకం యంత్రాలు, గ్రేడింగ్ యంత్రాలు తదితర సదుపాయాలను పరిశీలించిన కలెక్టర్, కొనుగోలు ప్రారంభానికి ముందే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గత సంవత్సరం కొనుగోలు వివరాలు, ప్రస్తుత సీజన్ అంచనాలు, టార్పాలిన్లు, గన్నీ బ్యాగుల నిల్వలపై సమాచారం సేకరించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని సూచించారు. చెల్లింపులు ఆలస్యం కాకుండా తక్షణమే బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని, పారదర్శకత పాటించాలని ఆదేశించారు. అనంతరం కరివారిగూడెం గ్రామంలో మిషన్ భగీరథ వాటర్



ట్యాంక్‌ను పరిశీలించిన కలెక్టర్, తాగునీటి సరఫరాలో ఉన్న సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అవసరమైతే ప్రత్యామ్నాయంగా బోర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని సూచించారు. వేసవి కాలం మొత్తం తాగునీటి ఎద్దడి లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, మండల వ్యవసాయ శాఖ అధికారి దీపక్ ఆనంద్, మిషన్ భగీరథ అధికారులతో పాటు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జడ్జిని కలిసిన బార్ అసోసియేషన్ ఈసీ సభ్యులు

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** జిల్లా ప్రధాన స్పెషల్ న్యాయమూర్తి జి.ప్రేమలతను కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కిరణ్ ముధల్కర్ సభ్యులతో పాటు ఈసీ మెంబర్లు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాన్ని అందజేశారు. ఈ సంధర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు కిరణ్ ముదల్కర్ మాట్లాడుతూ జిల్లా న్యాయమూర్తికి న్యాయవాదులకు న్యాయవాదులందరం అన్ని విధాల సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. న్యాయవస్థ అభివృద్ధికి తోడ్పాటునందిస్తామని పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థకు ప్రజలకు మధ్య మంచి వాతావరణం నెలకొనేలా అందరము కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు 1 షేక్ సాజహన్ పర్వీన్, ఉపాధ్యక్షులు 2 కాటూరి సంజీవ్ రావు, ప్రధాన కార్యదర్శి గడిపెల్లి మహేష్, జాయింట్ సెక్రటరీ గాడదాసు



నాగరాజు, క్రీడల కార్యదర్శులు బానోత్ దేవదాసు, నకరాకంటి ఉమ, మహిళా ప్రతినిధి మల్లెల ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

# ఐటీసీ కాంట్రాక్ట్ కార్మికుల నిరాహార దీక్ష

**22వ రోజు కొనసాగింపు**

**బూర్గంపహాడ్ మహా :** ఐటీసీ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కొనసాగుతున్న నిరాహార దీక్షలు 22వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఈరోజు దీక్షలో భాగంగా మేకల శేషమ్మ, సోయం ముత్తయ్య, వెసంపల్లి సత్యనారాయణ, అకిన చందర్ రావు పాల్గొన్నారు. దీక్షలో పాల్గొంటున్న కార్మికులకు మద్దతుగా బిట్ర సాయి బాబా, జేఏసీ కన్వీనర్ పాటి సోమిరెడ్డి, అకిన సర్వేశ్వర్ రావు, సతీష్, చుక్కపల్లి బాలాజీ పూలమాలలు వేసి దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కాంట్రాక్ట్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం, యాజ



మాన్యం వెంటనే పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు దీక్షలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# నాటుసారా విక్రయాలపై ఎక్సైజ్ దాడులు

**నలుగురిపై కేసులు నమోదు**

**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆబ్కారీ అధికారి జానయ్య ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా నాటుసారా, మత్తు పదార్థాల నియంత్రణపై ఎక్సైజ్ శాఖ చర్యలు ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలో జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్ కరంచంద్, భద్రాచలం ఎక్సైజ్ SHO రహిమున్నిసా బేగం ఆధ్వర్యంలో బూర్గంపాడు మండలం NP రెడ్డిపాలెం గ్రామంలో గురువారం నాడు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల్లో నాటుసారా విక్రయాలు నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేసి, వారి వద్ద నుంచి సుమారు 16 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామంలో నాటుసారా, మత్తు పదార్థాల వినియోగం




వల్ల కలిగే హానికర ప్రభావాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు అక్రమ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సీతారామరాజు, గౌతమ్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకై 'అరైవ్–అలైవ్' అవగాహన కార్యక్రమం

**ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహణ**



**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ఘనంగా జరిగింది. ఎంపీడీవో జమలారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణకై "అరైవ్-అలైవ్" అవగాహన కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాల్వంచ సర్కిల్ డీఎస్పీ సతీష్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం ఏప్రిల్ 13 నుండి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా "అరైవ్-అలైవ్" రోడ్డు భద్రతా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ వినియోగం, సురక్షిత ప్రయాణంపై పోలీస్ మరియు రవాణా శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహన పత్రాలు సక్రమంగా ఉండాలని సూచించారు. అనంతరం భద్రాచలం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వెంకటపుల్లయ్య మాట్లాడుతూ, ఇంటి నుండి సురక్షితంగా బయలుదేరడం "అరైవ్" కాగా, తిరిగి సురక్షితంగా ఇంటికి చేరుకోవడం "అలైవ్" అని వివరించారు. రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని సూచించారు. ఎంపీడీవో జమలారెడ్డి మాట్లాడుతూ, ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక ముఖ్య ఉద్దేశం ప్రభుత్వం అందిస్తున్న నిధులు, పథకాలు ప్రజలకు ఎలా చేరుతున్నాయో వివరించడమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగమైన "అరైవ్-అలైవ్" రోడ్డు భద్రతా అవగాహన అత్యంత ముఖ్యమని చెప్పారు. వాహనదారులు మాత్రమే కాకుండా పాదాచారులు కూడా జాగ్రత్తగా రోడ్లపై నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మందా నాగరాజు, తహసీల్దార్ ప్రసాద్, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, సిబ్బంది మరియు ప్రజలు పాల్గొన్నారు.

# చలో హైదరాబాద్...

- సింగరేణి కాపాడుకుందాం..
- రూ.56 వేల కోట్ల బకాయిలురాబట్టాలి
- ఈనెల 28న విద్యుత్ సౌధ, సెక్రటేరియట్ ముట్టడి.. : సిఐటియు నేతలు

**మణుగూరు, మహా :** సింగరేణి సంస్థ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుపోయిందని, కార్మికుల జీతాల చెల్లింపుల కోసం ప్రతినెల రూ.350 కోట్లకు పైగా అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొన్నదని సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మంద నరసింహారావు, తుమ్మల రాజిరెడ్డి అన్నారు. తెలంగాణ విద్యుత్ సంస్థల నుండి రావాల్సిన రూ.56 వేల కోట్ల బకాయిలు రాకపోవడం వల్లే సంస్థ అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మణుగూరు ప్రాంతంలోని పీకేఓసీ2, కేపీయూజీ, ఏరియా వర్క్‌షాప్, ఏరియా హాస్పిటల్, సివిల్ డిపార్ట్‌మెంట్, జీఎం కార్యాలయాల్లో గురువారం నిర్వహించిన సమావేశాల్లో వారు పాల్గొని మాట్లాడారు. సింగరేణి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతున్న నేపథ్యంలో కార్మికులు ఐక్యంగా పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఓపెన్ కాస్ట్ గనుల్లో బొగ్గు తవ్వకాల పనులను సింగరేణి పర్మినెంట్ కార్మికులతోనే చేపట్టాలని, నైని బ్లాకులను ప్రైవేటు వారికి అప్పగించకుండా సంస్థ ఆధ్వర్యంలోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో రాజకీయ జోక్యాన్ని తగ్గించాలని, జరుగుతున్న కుంభకోణాలను అరికట్టాలని కోరారు.

**28న భారీ నిరసనకు పిలుపు..**

సింగరేణి పరిరక్షణతో పాటు కార్మిక సమస్యల పరిష్కారం కోసం ఈనెల 28న హైదరాబాద్‌లో విద్యుత్ సౌధ, సెక్రటేరియట్ ముట్టడిని విజయవం




తం చేయాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి బకాయిల వసూళ్లు సాధించాలని సూచించారు. హామీల అమలుపై ఆగ్రహం వ్యక్తం చేసిన వారు సంవత్సరానికి పైగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను వెంటనే అమలు చేయాలని, ఎన్నికల ముందు ఇచ్చిన సొంత ఇంటి పథకం హామీని నెరవేర్చాలని కోరారు. ఎన్నికల తర్వాత రెండేళ్లు పూర్తయినా ప్రధాన సమస్యలు పరిష్కారం కాకపోవడం పట్ల ప్రాతినిధ్య సంఘాల వైఖరిపై విమర్శలు గుప్పించారు.

**మణుగూరు భవిష్యత్తుపై ఆందోళన..**

మణుగూరు డిప్ సైడ్ బ్లాక్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం వైఖరిని నేతలు ఇరువురు తీవ్రంగా ఖండించారు. ఓసీ2 ప్రాజెక్టు సింగరేణికి రాకపోతే మణుగూరు ప్రాంత భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, సిఐటియు బ్రాంచ్ అధ్యక్షుడు వల్లూరు వెంకటరత్నం, కార్యదర్శి మాచారపు లక్ష్మణరావు, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు సాయి కృష్ణ, ఎండి ముజఫర్, నల్లెల విల్సన్ రాజు, ముత్యాల సుమన్, జిల్లా కమిటీ సభ్యులు సత్రపల్లి సాంబశివరావు, మండల కన్వీనర్ కొడిశాల రాములు, సతీష్, బిక్షపతి, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ కార్మికులకు సీఎంపీఎఫ్ పాస్‌బుక్స్

- ఏరియా జీఎంకు నేతల కృతజ్ఞతలు..
- సమస్యల పరిష్కారానికి వినతి..
- సీఎంపీఎఫ్ అధికారులకు సత్కారం..

**మణుగూరు, మహా :** మణుగూరు ఏరియాలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు గత సంవత్సరం చివరి వరకు సీఎంపీఎఫ్ వివరాలతో కూడిన పాస్‌బుక్స్ అందజేయడంపట్ల ఐఎఫ్‌టియు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియలో ప్రత్యేక కృషి చేసిన ఏరియా జీఎం దుర్గం రామచందర్‌కు కాంట్రాక్ట్ కార్మికుల తరపున కృతజ్ఞతలు నాయకులు తెలిపారు. గురువారం మధ్యాహ్నం ఏరియా జీఎం కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో కొత్తగూడెం సీఎంపీఎఫ్ రీజనల్ కమిషనర్లు కే వంశీధర్, ఎం కనకమ్మలను కాంట్రాక్ట్ కార్మికులు పుష్పగుచ్చాలు, శాలువాలతో ఘనంగా సత్కరించి తమ కృతజ్ఞత భావాన్ని వ్యక్తం చేశారు. అదేవిధంగా ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో




వివిధ సమస్యల పరిష్కారానికి సంబంధించిన వినతి పత్రాన్ని సీఎంపీఎఫ్ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా గోదావరిలోయ బొగ్గుగని కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యస్.డి నాసర్ పాషా మాట్లాడుతూ.., కాంట్రాక్ట్ కార్మికులకు సీఎంపీఎఫ్ పాస్‌బుక్స్ అందజేయడంలో సహకరించిన జీఎం దుర్గం రామచందర్, పీఎఫ్ అధికారులు, సింగరేణి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

## పరిష్కరించాల్సిన ప్రధాన డిమాండ్లు

2026 మార్చి నెలాఖరు వరకు సీఎంపీఎఫ్ లెక్కలను త్వరితగతిన పాస్‌బుక్స్ రూపంలో అందజేయాలని, పర్మినెంట్ ఉద్యోగుల మాదిరిగా కాంట్రాక్ట్ కార్మికులకు కూడా సీఎంపీఎఫ్ ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తేవాలని కోరారు. ఏరియా స్టోర్ కాంట్రాక్ట్ కార్మికులకు సంబంధించిన పీఎఫ్ లెక్కల్లో స్పష్టత కల్పించి, వారికి కూడా పాస్‌బుక్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది, వాహన డ్రైవర్లు, ఉద్యానవనాలు, గెస్ట్ హౌస్‌లలో పనిచేస్తున్న కార్మికులకు కూడా 2026 వరకు సీఎంపీఎఫ్ లెక్కలు అందజేయాలని కోరారు. అనారోగ్యంతో మృతి చెందిన లేదా పనులు మానుకున్న కార్మికులకు సంబంధించిన రిటర్న్‌స్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని, కొత్తగా చేరిన వారికి వెంటనే పీఎఫ్ ఐడీ, నెంబర్ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికుల సూపర్వైజర్లు హాథీరాం, రాజేష్, భీమరాజు, పసిబాలు, ప్రకాష్, దయాకర్ పాల్గొన్నారు. అలాగే కార్మికులు వెంకటేశ్వర్లు, రాయల ప్రసాద్, గుమ్మడి అమృతరావు, బత్తుల లక్ష్మణ్, వెంకన్న, రంగయ్య, అన్నారం రవి, మూర్తి, పాయం రాజు, రమేష్, సక్కుబాయి, స్వరూప, ఎల్లమ్మ తదితరులు, అధికారులు, కార్మిక సంఘాల నాయకులు హాజరయ్యారు.

# ఆ రెండు బోర్లలో నీరు ఆరోగ్యానికి హానికరం

**సర్పంచ్ కొర్సా రమేష్**

**జూలూరుపాడు, మహా:** గత 15 సంవత్సరాలు గా ఆ గ్రామ ప్రజలు తాగుతున్న ఆ రెండు బోర్ల నీటిని ఇకనుండి తాగవద్దని ఆ గ్రామ సర్పంచ్ కొర్సా రమేష్ గ్రామస్తులను కోరారు. ఆ బోర్లలో నీటిని తాగడం వలన అనేక రకాల ఆరోగ్య సమస్యలతో పాటు, కిడ్నీ సంబంధిత వ్యాధులు ప్రబలుతున్నట్లు సంబంధిత శాఖ జిల్లా డాక్టర్లు గుర్తించినట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధి అనంతారం గ్రామంలో ఇటీవల అనేకమంది కిడ్నీ సంబంధిత వ్యాధితో మృతి చెందారు. ఇంకా గ్రామంలో అనేకమంది అదే వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో గ్రామంలో ప్రజలు వాడుతున్న నీటిని జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ డాక్టర్ ఈ శరత్, డాక్టర్ ఇమ్మానియేల్, డాక్టర్ ప్రసాద్ లు పరిశీలించి పరీక్షించినట్లు తెలిపారు. పరిశీలన అనంతరం గ్రామంలో కిడ్నీ సంబంధిత అనారోగ్యాలకు ముఖ్య కారణం ఆ రెండు బోర్లలో నీరేనని నిర్ధారించినట్లు సర్పంచ్ రమేష్ తెలిపారు. అట్టి విషయాన్ని డాక్టర్లు గురువారం జరిగిన మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధుల సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కి నివేదించినట్లు తెలిపారు. వెంటనే స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులకు ప్రత్యన్మయ ఏర్పాట్లను చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. కావున గ్రామ ప్రజలందరూ గమనించి



తాగునీరు మినహా ఇతర అవసరాలకు మాత్రమే ఆ నీటిని వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్, సబ్ సెంటర్ సూపర్వైజర్ రాధిక, ఏఎన్ఎం సావిత్రి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉసికల వెంకటేశ్వర్లు, మలకం వీరభద్రం, ఆశా కార్యకర్త పూనెం ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

ANN తెలుగు
మహా పత్రిక
శుక్రవారం, హైదరాబాద్
17-04-2026






# తెలంగాణ కులాల లెక్క తేలింది

(మహా ప్రత్యేకం)

తెలంగాణ రాష్ట్ర చరిత్రలో మున్నెన్నడూ లేని విధంగా నిర్వహించిన 'తెలంగాణ సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, కుల సర్వే 2024' నివేదిక వివరాలను ప్రభుత్వ గణాంక విభాగం విడుదల చేసింది. కులాల వారీగా లెక్కతేల్చి.. ఈ సర్వే చేసిన తొలి ప్రభుత్వంగా దేశంలో రేవంత్ సర్కార్ ప్రత్యేకత నిలుపుకుంది.

### తెలంగాణ సామాజిక సర్వే

రాష్ట్ర మొత్తం జనాభా 3,54,77,554

### తెలంగాణలో కులాల వారీగా జనాభా శాతం

ఎస్సీ 17.43%
ఎస్టీ 10.45%
ఓసీ 15.79%
బీసీలు 46.25%
ముస్లిం మైనారిటీలు 12.56%
బీసీ ముస్లింలను కలిపితే....
మొత్తం బీసీ జనాభా 56.33%

తెలంగాణలో అత్యధిక జనాభా ఉన్న టాప్ 20 కులాలు (జనాభాతో సహా)..

మాదిగ - 36,57,551 (10.3%)
ముదిరాజ్ - 26,39,027 (7.4%)
లంబాడీ / బంజారా - 24,04,056 (6.8%)
యాదవ - 20,18,725 (5.7%)
రెడ్డి - 17,10,244 (4.8%)
గౌడ్ - 16,30,187 (4.6%)
మాల - 14,71,514 (4.1%)
మున్నూరు కాపు - 13,75,018 (3.9%)
పద్మశాలి - 11,82,252 (3.3%)
రజక - 9,95,972 (2.8%)
కురుమ / కురుబ - 7,95,822 (2.2%)
ఒడ్డు / వడ్డెర - 6,43,571 (1.8%)
ముస్లింలు - 6,32,782 (1.8%)
అగ్నికులక్షత్రియ - 5,27,119 (1.5%)
కొమటి / వైశ్య - 5,08,813 (1.4%)
నాయి బ్రాహ్మణ్ - 4,33,785 (1.2%)
కుమ్మర - 4,31,363 (1.2%)
కోయ - 4,28,142 (1.2%)
వడ్రంగి - 4,07,927 (1.1%)
గోండ్ - 3,81,895 (1.1%)

## ముదిరాజ్, యాదవ, షేక్ వర్గాలదే పైచేయి

రాష్ట్ర సామాజిక శక్తిని విశ్లేషిస్తే, బీసీ-డి మరియు బీసీ-ఈ విభాగాల్లోని కొన్ని సామాజిక వర్గాలు అత్యంత భారీ జనాభాతో రాజకీయంగా నిర్ణయాత్మక శక్తిగా ఎదిగాయి. ముఖ్యంగా ముదిరాజ్ సామాజిక వర్గం 26,39,027 మంది జనాభాతో, అంటే మొత్తం జనాభాలో 7.4 శాతం వాటాతో బీసీ-డి విభాగంలో అతిపెద్ద వర్గంగా అవతరించింది. దీనికి దీటుగా యాదవ (గొల్ల) సామాజిక వర్గం 20,18,725 మందితో 5.7 శాతం వాటాను కలిగి ఉండగా, మున్నూరు కాపులు 13,75,018 మందితో 3.9 శాతంగా నిలిచారు. ఇక మైనారిటీల విభాగమైన బీసీ-ఈలో షేక్ సామాజిక వర్గం ఏకంగా 27,95,727 మంది జనాభాతో, అంటే 7.9 శాతం వాటాతో రాష్ట్రంలోనే అత్యధిక జనాభా కలిగిన బీసీ ఉప కులంగా రికార్డు సృష్టించింది. ఈ వర్గాల జనాభా బలం ఇప్పుడు రాష్ట్ర రాజకీయ సమీకరణాలను శాసించే స్థాయికి చేరుకుంది.

## బీసీ-డి, సీ, ఈ వర్గాల సమగ్ర గణాంకాలు

బీసీడి విభాగంలో ముదిరాజ్, యాదవ, మున్నూరు కాపుల తర్వాత ఉప్పర (1.24 లక్షలు), ఆరెవల్లి (1.10 లక్షలు), చిప్పోలుమేర (1.04 లక్షలు), ఆరె కటిక (1.03 లక్షలు) మరియు మాలి (83 వేలు) వర్గాలు ప్రధానంగా ఉన్నాయి. భట్రాజు, లక్కమారికాపు, హత్కర్, కుర్మి, లోధ్ వంటి కులాలు కూడా ఐదు అంకెల జనాభాను కలిగి ఉన్నాయి. బీసీసి విభాగంలో ఎస్సీల నుంచి క్రైస్తవులుగా మారిన వారి సంఖ్య 70,664 (0.2%) గా నమోదైంది. ఇక బీసీఈ విభాగంలో షేక్‌ల తర్వాత ధోబీ ముస్లింలు 1.26 లక్షలతో, ఖురేషీలు ఒక లక్షతో తమ జనాభా బలాన్ని చాటుకున్నారు. ఫకీర్ ముస్లింలు (46 వేలు), గోసంగి ముస్లింలు (21 వేలు), సిద్ధి (16 వేలు), అత్తార్ (15 వేలు) వంటి వర్గాలు కూడా ఈ సామాజిక సర్వేలో తమ స్థానాన్ని స్పష్టంగా నమోదు చేసుకున్నాయి.

## వెనుకబడిన తరగతులు - గ్రూప్ ఈ

- అచ్చుకట్టలవాండ్లు, సింగాలి, సింగంవాళ్లు, అచ్చుపానివాళ్లు: 4,539 (0.01%)
- అత్తార్ సాయిబులు, అత్తరోళ్లు: 15,419 (0.04%)
- ధోబీ ముస్లిం/ ముస్లిం ధోబీ (చాకలి, తురక చాకలి): 1,26,438 (0.4%)
- ఫకీర్, ఫకీర్ బుడబుడ్కి, గంటి ఫకీర్, తురక బుడబుడ్కి: 46,418 (0.1%)
- గారడీ ముస్లిం, గారడీ సాయిబులు: 14,204 (0.04%)
- గోసంగి ముస్లిం, ఫకీర్ సాయేబులు: 21,337 (0.1%)
- గుడ్డి ఎలుగువాళ్లు, ముసల్మాన్ కీలు గుర్రాలవాళ్లు: 2,416 (0.01%)
- హజామ్, నై, నై ముస్లిం, నవిద్: 9,783 (0.03%)
- లబ్బి, లబ్బై, లబ్బన్, లబ్బా: 2,681 (0.01%)
- పకీర్ల, బోరెవాలె, దీరా ఫకీర్ల, బొంతల: 14,697 (0.04%)
- ఖురేషి, కసబ్, మరాఠి కసబ్, ముస్లిం కటిక: 1,00,619 (0.3%)
- షేక్/ షేక్: 27,95,727 (7.9%)
- సిద్ధి, యాబా, హబ్షి, జాసి: 16,672 (0.05%)

## బీసీ-ఏ విభాగంలో రజక, వడ్డెర వర్గాలు టాప్

వెనుకబడిన తరగతుల మొదటి శ్రేణి అయిన బీసీఏ విభాగంలో రజక (చాకలి) సామాజిక వర్గం 9,95,972 మంది జనాభాతో (2.8%) అగ్ర స్థానంలో నిలవగా, వడ్డెర (ఓడె) వర్గం 6,43,571 మందితో (1.8%) తన బలాన్ని చాటుకుంది. అగ్నికుల క్షత్రియ వర్గం 5.27 లక్షలతో (1.5%), నాయి బ్రాహ్మణులు 4.33 లక్షలతో (1.2%) మరియు వాల్మీకి బోయలు 3.59 లక్షల మంది జనాభాతో (1.0%) రాష్ట్ర సామాజిక ముఖచిత్రంలో కీలక భాగస్వాములుగా ఉన్నారు. ఈ విభాగంలోనే గంగిరెడ్లవారు (92 వేలు), మేదరి (77 వేలు), జంగం (55 వేలు), పిచ్చిగుంట్ల (50 వేలు) మరియు మెహతర్ ముస్లింలు (47 వేలు) వంటి కులాలు కూడా గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. అత్యల్ప జనాభా కలిగిన అద్దపువారు (1,566), గంజికుటి (1,393), నొక్కర్ (1,558) వంటి కులాలను సైతం కమిటీ లెక్కించింది.



## బీసీ-బి కేటగిరీలో కుల వృత్తుల ప్రభావిత శక్తి

వృత్తి కులాల సమాహారమైన బీసీబి విభాగంలో గౌడ సామాజిక వర్గం 16,30,187 మంది జనాభాతో (4.6%) అత్యంత బలమైన వర్గంగా ఉంది. చేనేత రంగానికి చెందిన పద్మశాలి వర్గం 11,82,252 మందితో (3.3%), కురుబ (కురుమ) వర్గం 7,95,822 మందితో (2.2%) తర్వాతి స్థానాల్లో నిలిచాయి. కుమ్మర (శాలివాహన) 4.31 లక్షలు (1.2%), వడ్రంగి (వడ్ల) 4.07 లక్షల మందితో (1.1%) తమ జనాభా వాటాను స్థిరపరుచుకున్నాయి. దూదేకుల (2.69 లక్షలు), గోల్డ్ స్మిత్ (2.48 లక్షలు), పెరిక (2.30 లక్షలు), బ్లాక్ స్మిత్ (1.65 లక్షలు) వంటి వర్గాల జనాభా కూడా లక్ష దాటడం గమనార్హం. ఆరే మరాఠీ, ఆర్యక్షత్రియ, గాండ్ల, దేవాంగ వంటి కులాలు కూడా వేల సంఖ్యలో తమ ఉనికిని నిలబెట్టుకున్నాయి.

# తెలంగాణ సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, కుల సర్వే -2024 గణాంకాలు

## వెనుకబడిన తరగతులు - గ్రూప్ ఏ

- అద్దపువారు: 1,566 (0.004%)
- అగ్నికులక్షత్రియ (పల్లి, వడబలిజ, బేస్త, జాలరి, గంగవారు, గంగపుత్ర, గూండ్ల, వన్యకులక్షత్రియ, వన్నెరెడ్డి, పల్లికాపు, పల్లిరెడ్డి, నెయ్యల, పట్టపు): **5,27,119 (1.5%)**
- బాగోతుల/భాగవతుల: 2,102 (0.01%)
- బైల్ కమ్మర/ఘిసాడి/గాడియ లోహర్: 7,217 (0.02%)
- బాలసంతు, బహురూపి: 40,156 (0.1%)
- బుడబుక్కల: 32,740 (0.1%)
- బుక్క అయ్యవార్స్: 8,547 (0.02%)
- చోపెమారి: 6,365 (0.02%)
- దాసరి (భిక్షాటన చేసేవారు): 32,196 (0.1%)
- దొమ్మర: 41,836 (0.1%)
- ఏనూటి/యేనేటివాళ్లు: 2,471 (0.01%)
- గంగిరెడ్లవారు: 92,430 (0.3%)
- గంజికుటి/గంజికుటివారు: 1,393 (0.004%)
- గోత్రాల: 5,739 (0.02%)
- గౌడ జెట్టి: 23,018 (0.1%)
- గుడాల: 3,747 (0.01%)
- జంగం (భిక్షాటన చేసేవారు): 55,112 (0.2%)
- జోగి: 37,940 (0.1%)
- జోషినందివాలాస్: 9,445 (0.03%)
- కైకాడి: 1,658 (0.005%)
- కాకిపడగల: 2,001 (0.01%)
- కంజర - భట్ట: 1,967 (0.01%)
- కాశీకాపడి / కాశీకాపుడి: 25,828 (0.1%)
- కాటిపాపల: 19,991 (0.1%)
- కెప్మారె లేదా రెడ్డిక: 21,835 (0.1%)
- కునపులి: 23,378 (0.1%)
- మందుల: 28,568 (0.1%)
- మేదరి లేదా మహేంద్ర: 77,645 (0.2%)
- మెహతర్ (ముస్లిం): 47,134 (0.1%)
- మొందెపట్టు: 2,014 (0.01%)
- మొందివారు, మొందిబండ, బండ: 16,355 (0.05%)
- నాయిబ్రాహ్మణ (మంగలి, మంగళ, భజంత్రి): 4,33,785 (1.2%)
- నొక్కర్: 1,558 (0.004%)
- ఒడ్/ఓడ్/ఓడ్: 4,049 (0.01%)
- ఓడె (ఒడ్డిలు, వద్ది, వడ్డెలు, వడ్డెర, వడ్డబోయి, వడియరాజ్): 6,43,571 (1.8%)
- పాలఏకరి, ఏకిల, వ్యాకుల, ఏకిరి, నాయనివారు, పాలెగారు, తోలగారి, కావలి: 4,346 (0.01%)
- పాంబల: 5,608 (0.02%)
- పాముల: 35,833 (0.1%)
- పార్ధి (నిర్షికారి): 9,303 (0.03%)
- పారికి ముగ్గుల: 2,100 (0.01%)
- పటంవారు/మసయ్యులు: 1,444 (0.004%)
- పాత్ర: 5,037 (0.01%)
- పెద్దమ్మవాండ్లు, దేవరవాండ్లు, ఎల్లమ్మవాండ్లు, ముత్యాలమ్మవాండ్లు, దమ్మాలి: 20,447 (0.1%)
- పూసల: 40,710 (0.1%)
- రజక (చాకలి, వన్నార్): 9,95,972 (2.8%)
- రాజన్నాల, రాజన్నలు: 7,549 (0.02%)
- సిద్ధుల: 2,099 (0.01%)
- సిక్లీగర్/సైకల్గర్: 9,996 (0.03%)
- సొన్నాయిల/సన్నాయిల/సన్నాయొళ్లు: 4,959 (0.01%)
- శ్రీ క్షత్రియ రామజోగి/రామజోగి/రామజోగుల: 3,133 (0.01%)
- తెరచీరల/తెలిసోరి/బైకాని: 1,686 (0.005%)
- తోలుబొమ్మలాటవారు/ బొప్పల: 2,044 (0.01%)
- వాల్మీకి బోయ (బోయ, బేదర్, కిరాతక, నిషాది, యెల్లపి, పెద్ద బోయ, తలయారి, చుండువాళ్లు): 3,59,230 (1.0%)
- వంశ రాజ్ / పిచ్చిగుంట్ల: 50,021 (0.1%)
- వీరముష్టి (నెట్టికోటల), వీరభద్రీయ: 18,038 (0.1%)
- యాత: 1,854 (0.01%)

## వెనుకబడిన తరగతులు - గ్రూప్ సి

ఎస్సీల నుండి క్రైస్తవ మతంలోకి మారిన వారు: **70,664 (0.2%)**

## వెనుకబడిన తరగతులు - గ్రూప్ బి

- ఆరె మరాఠీ, మరాఠా (బ్రాహ్మణేతర): 87,540 (0.2%)
- ఆర్యక్షత్రియ, చిత్తారి, గినియార్, చిత్రకార, నకాష్: 56,875 (0.2%)
- కమ్మరి : 1,65,726 (0.5%)
- బొందిలి: 31,079 (0.1%)
- ముంచారి : 13,464 (0.04%)
- బుడుబుంజల/భుంజువ /భద్భుంజ: 2,468 (0.01%)
- దేవాంగ: 30,116 (0.1%)
- దూదేకుల, లద్దాఫ్, పింజారి లేదా నూర్‌బాష్: 2,69,699 (0.8%)
- గాండ్ల, తెలికుల, దేవతిలకుల: 53,866 (0.2%)
- ముంచారి : 2,48,965 (0.7%)
- గౌడ [ఈడిగ, గౌడ (గమల్ల), కలాలీ, గౌండ, మరియు శ్రీశయన (సెగిడి)]: 16,30,187 (4.6%)
- జంద్ర: 17,245 (0.05%)
- కరికలభక్తులు, కైకోలన్ లేదా కైకాల (సెంగుందం లేదా సెగుంతర్): 3,215 (0.01%)
- కర్ణభక్తులు: 3,616 (0.01%)
- కాశీ / సిల్పిస్: 4,001 (0.01%)
- కుమ్మర లేదా కులాల, శాలివాహన: 4,31,363 (1.2%)
- కురుబ లేదా కురుమ: 7,95,822 (2.2%)
- లోధ్/లోధి/లోధా: 15,238 (0.04%)
- నీలకంఠి: 9,722 (0.03%)
- నీలి: 7,156 (0.02%)
- నెస్సి లేదా కుర్ని: 13,804 (0.04%)
- పద్మశాలి (సాలి, సాలివన్, పట్టుశాలి, సేనపతులు, తొగట సాలి): 11,82,252 (3.3%)
- పట్కార్ (ఖత్రి): 28,356 (0.1%)
- పెరిక (పెరిక బలిజ, పురగిరి క్షత్రియ): 2,30,851 (0.6%)
- స్వకులసాలి: 8,345 (0.02%)
- తొగట, తొగటి లేదా తొగటవీరక్షత్రియ: 21,474 (0.1%)
- వడ్రంగి / వడ్ల: 4,07,927 (1.1%)

## వెనుకబడిన తరగతులు - గ్రూప్ డి

- అగముడియన్, అగముడియార్, అగముడివెళ్ళాలర్ (తులువ వెళ్ళాలలతో కలిపి): 2,515 (0.01%)
- అహీర్/అహీర్ యాదవ్: 4,539 (0.01%)
- ఆరె, ఆరెవళ్లు మరియు అరోళ్లు: 1,10,693 (0.3%)
- ఆరెకటిక, కటిక, ఆరెసూర్యవంశి: 1,03,572 (0.3%)
- అయ్యరక: 2,215 (0.01%)
- భట్రాజు: 21,423 (0.1%)
- చిప్పోలు (మేర): 1,04,979 (0.3%)
- గోవిలి/గోవ్లి/గౌలి/గావ్లి: 3,903 (0.01%)
- హత్కర్: 17,977 (0.1%)
- జింగార్: 4,479 (0.01%)
- కచ్చి: 4,503 (0.01%)
- కోష్టి: 2,636 (0.01%)
- కృష్ణబలిజ (దాసరి, బుక్క): 10,708 (0.03%)
- కుల్లకడగి/కుల్లెకడిగి/చిత్తెపు: 23,137 (0.1%)
- కుర్మి: 41,346 (0.1%)
- లక్కమారికాపు: 34,784 (0.1%)
- మాలి (బరే, బర్రై, మరార్ మరియు తంబోలి): 83,854 (0.2%)
- మధుర: 43,998 (0.1%)
- ముదిరాజ్, ముత్రాసి, తెనుగొల్లు: 26,39,027 (7.4%)
- మున్నూరుకాపు: 13,75,018 (3.9%)
- నగరాలు: 1,954 (0.01%)
- పాస్సి: 5,587 (0.02%)
- రంగరేజ్ లేదా భవసార క్షత్రియ: 26,086 (0.1%)
- సాధుచెట్టి: 1,858 (0.01%)
- సరోళ్లు/సోమ వంశ క్షత్రియ: 5,288 (0.01%)
- సాతాని (చట్టాదశ్రీవైష్ణవ): 31,454 (0.1%)
- సిస్టకరణం: 4,587 (0.01%)
- సొండి / సుండి: 1,411 (0.004%)
- సూర్యబలిజ (కలవంతుల), గణిక: 6,843 (0.02%)
- తమ్మలి (బ్రాహ్మణేతర) (శూద్రకులం): 11,140 (0.03%)
- ఉప్పర లేదా సగర: 1,24,148 (0.3%)
- వంజర (వంజారి): 62,023 (0.2%)
- వరాల: 3,939 (0.01%)
- వీరశైవలింగాయత్ /లింగబలిజ: 1,73,192 (0.5%)
- యాదవ (గొల్ల): 20,18,725 (5.7%)

# వర్షా కాలం ప్రారంభం ముందే సిహెచ్‌సి భవనం పూర్తి చేయాలి: కే.వి. రమణ



**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపహాడ్ మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సిహెచ్‌సి) భవనాన్ని వర్షాకాలం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని బీఆర్ఎస్ నాయకులు కే.వి. రమణ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు కే.వి. రమణ, తోకల శ్రీనివాస్, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్ తదితరులు నిర్మాణ స్థలాన్ని సందర్శించి పనులను పరిశీలించారు.

**రూ . 2.70 కోట్లతో శంకుస్థాపన – పనుల ఆలస్యం పై ఆవేదన**

ఈ సందర్భంగా కే.వి. రమణ మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో రేగా కాంతారావు చొరవతో డీఎంఎఫ్టీ నిధుల ద్వారా రూ. 2 కోట్ల 70 లక్షలతో ఈ భవనానికి మంజూరు జరిగి, 2023 సెప్టెంబర్‌లో శంకుస్థాపన జరిగిందని గుర్తు చేశారు. ప్రస్తుతం 30 పడకల ఆసుపత్రి భవన నిర్మాణం నత్తనడకన సాగుతుండటం బాధాకరమని తెలిపారు.

**పాత ఆసుపత్రి దుస్థితి – రోగులకు ప్రమాదం**

ఇప్పటికే ఉన్న పాత ఆసుపత్రి భవనం చాలా దెబ్బ తిన్న స్థితిలో ఉందని, వర్షాల సమయంలో సీలింగ్ ఊడిపోవడం, గోడలు తడిసి ఎప్పుడైనా కూలిపోయే పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఖరీదైన వైద్య పరికరాలు కూడా పాత భవనంలోనే ఉండటం వల్ల అవి దెబ్బతినే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

**త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి**

నూతన భవన నిర్మాణాన్ని వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని బీఆర్ఎస్ పార్టీ తరపున డిమాండ్ చేశారు. ప్రజాధనం వృథా కాకుండా ఖరీదైన వైద్య సామాగ్రిని రక్షించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

**అధికారులు, ఎమ్మెల్యే స్పందించాలని విజ్ఞప్తి**

నిర్మాణ పనుల ఆలస్యంపై తగు విచారణ జరిపి, స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వీడి వెంటనే పనులు పూర్తి చేయాలని ప్రజల తరపున విజ్ఞప్తి చేశారు.

# కంప్యూటర్ టీచర్లుగా ప్రభుత్వం తీసుకోవాలని ఎమ్మెల్యేకు వినతి



**దమ్మపేట ,మహా :** నేడు ప్రభుత్వ ఆశ్రమ ,గురుకుల ,వసతి గృహాలలో కంప్యూటర్ సేవలు ఎంతో ప్రధానపాత్ర పోషిస్తున్న తరుణంలో ,కంప్యూటర్ టీచర్లుగా పనిచేస్తున్న కార్మిక యువతను ప్రభుత్వం ద్వారా నియామకాలు జరపాలని అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ ను గురువారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కంప్యూటర్ ఐసిటీలు మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలో గత కొన్నేళ్లుగా కంప్యూటర్ విద్యను విద్యార్థులకు అందిస్తూ ,పాఠశాల కు అవసరమైన కంప్యూటర్ సేవలను కూడా నిర్వహిస్తున్నామని ఐసిటీలు తెలిపారు. ఇప్పటి వరకు ఉద్యోగ భద్రత లేకుండా ,చాలీ చాలని వేతనాల తో ,అర్ధాకలితో కంప్యూటర్ టీచర్ గా పనిచేస్తున్నామని ఆవేదన చెందారు. థర్డ్ పార్టీ వారిచేత నియామకం పొంది తక్కువ జీతాలతో వెట్టి చాకిరీ చేస్తున్నామన్నారు. ప్రభుత్వం ,అధికారులు స్పందించి తమ గోడును పట్టించుకోవాలని అభ్యర్ధిస్తున్నామన్నారు. ఈ విషయాన్ని దమ్మపేట పర్యటన కు వచ్చిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి తీసుకువెళ్ళాలని కోరారు. ప్రతి పాఠశాల కు కంప్యూటర్ ఆపరేటర్ ఎంత అవసరం ఉందో ,ఒక్కసారి ఆలోచన చేయాలని కనీసం ఓట్ సోర్సింగ్ ఎంప్లాయిగా నైనా ఆశ్రమాలలో తీసుకోవాలని ముక్తకంఠంతో వేడుకుంటున్నామని ఆవేధన వ్యక్తం చేశారు.

# రోడ్డు ప్రమాదాల నివారణ సామాజిక బాధ్యత

- డిఫెన్సివ్ డ్రైవింగ్‌తో ప్రమాదాల నివారణ
- కారేపల్లిలో ఆరైవ్ - అలైవ్ కార్యక్రమం




**కారేపల్లి, మహా :** రోడ్డు ప్రమాదాల నివారణ సామాజిక బాధ్యత అని డిఫెన్సివ్ డ్రైవింగ్‌తో రోడ్డు ప్రమాదాల నివారించవచ్చని ఖమ్మం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఉదయ్‌కుమార్, కారేపల్లి ఎస్సై బైరు గోపీలు అన్నారు. సింగరేణి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం అరైవ్ అలైవ్ రోడ్ సేఫ్టీ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు డిఫెన్సివ్ డ్రైవింగ్ తారకమంత్రమని, పరిసరాలను గమనిస్తూ డ్రైవింగ్ చేయడం వల్ల రోడ్డు ప్రమాదాలను నివారించుకోవచ్చన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఏడాది రోడ్డు ప్రమాదాలతో అనేకమంది దుర్మరణం చెందడం బాధాకరమన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని ప్రభుత్వం గ్రామ స్థాయిలోకి తీసుకువెళ్తుందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ ఉల్లంఘనులపై కఠినంగా వ్యవహరించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. యువత సినిమాల్లో హీరోల్లాగా వాహనాలను నడుపవద్దని, వాహనాలను నడిపేటప్పుడు వాహనదారులు తమ భార్య, పిల్లలు, తల్లిదండ్రులను గుర్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు. వాహనాలు నడుపువారు విధిగా ట్రాఫిక్ రూల్సు పాటించాలని సూచించారు.

# పేదలందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు

- ఇందిరమ్మ ఇల్లు 96% పురోగతి
- సమీక్షా సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ చందన్‌కుమార్



**కారేపల్లి , మహా :** అర్హులైన పేదలందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలని మండల స్పెషల్ ఆఫీసర్, డీఎస్‌వో కే.చందన్‌కుమార్ అన్నారు. కారేపల్లి వైఎసఆర్ గార్డెన్‌లో ఎంపీడీవో శ్రీనివాసరావు అధ్యక్షతన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక`ప్రజా పాలన ప్రగతిపై వివిధ శాఖలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ మండలంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో 96శాతం పురోగతిలో ఉందన్నారు. రైతు భరోసా క్రింది 14079 మంది రైతులకు గాను రూ.13.11 కోట్లు పంపిణి జరిగిందన్నారు.మండలంలో 6, 816 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం పింఛన్ అందజేస్తుందన్నారు. అందులో 2733 మంది వఋద్ధులకు2692 మంది వితంతువులకు1008 వికలాంగులకు పింఛన్లు వస్తున్నట్లు తెలిపారు. 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక సంబంధించి గ్రామపంచాయతీలలో నిర్దేశించిన పనులను పూర్తి చేయవలసి ఉంటుందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అల్పాహారం తోపాటు 21 రకాల వస్తువులతో కిట్ అందజేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో విద్యార్థులను చేర్పించేందుకు ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎంపీవో మల్లెల రవీంద్ర ప్రసాద్, సూపరింటెండెంట్ మల్లెల రమేశ్, ఏవో బట్టు అశోక్ కుమార్, ఎంఈవో దుగ్గిరాల జయరాజు, ఐసీడీఎస్ సీడీపిఓ దయామణి, వైద్యాధికారి బీ.సురేష్, ఐకేపీ ఏపీఎం పిడమర్తి వెంకటేశ్వర్లు, స్థానిక సర్పంచ్ మేదరి వీరప్రతాఫ్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు భూక్యా రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డు సమస్యలపై మంత్రికి వినతి



**దమ్మపేట, మహా :** దమ్మపేట వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలో ఉన్న అశ్వారావుపేట, ములకలపల్లి ,దమ్మపేట యార్డులలో అవసరమైన మౌలిక సధుపాయాలను ఏర్పాట్లు చేయాలని డిప్యూటి సిఎం .మల్లు భట్టివిక్రమార్క కు ఏయంసి చైర్మన్ వాసం రాణి వినతి పత్రాన్ని అందించారు. బుధవారం మండలంలో పర్యటన కు వచ్చిన మల్లు తో కొద్దిసేపు ఆమె మాట్లాడారు. అశ్వారావుపేట లోని అల్లిగూడెం నుండి యార్డు వరకు రహదారి నిర్మాణం , దమ్మపేట ,ములకలపల్లి యార్డులలో మంచినీటి బోరు వసతి ఏర్పాట్లు ,కొన్ని చోట్ల ప్లాట్ ఫారమ్ ,షెడ్లు మరమ్మతులు గురించి నిధులు మంజూరు చేయించాలని ఆమె కోరారు. వివిధ చిన్న తరహా వసతులు గురించి కూడా ఆమె వినతిపత్రంలో పేర్కొన్నట్లుగా తెలిపారు. ఆమె వెంట అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ , కాంగ్రెస్ నాయకులు వాసం శ్రీనివాస్ ,తదితరులు ఉన్నారు.

# ప్రయాస్ తో పెన్షన్ సమస్యల పరిష్కారానికి దిశా నిర్దేశం..




**మణుగూరు, మహా :** బొగ్గు గనుల కార్మికుల సంక్షేమం, పెన్షన్ సమస్యల వేగవంతమైన పరిష్కారం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రయాస్ కార్యక్రమంపై అవగాహన సమావేశాన్ని గురువారం మణుగూరు ఏరియాలో నిర్వహించారు. డిజిఎం పర్సనల్ యస్ రమేశ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కొత్తగూడెం ప్రాంతీయ పిఎఫ్ కమిషనర్లు కే వంశీధర్, ఎం కనకమ్మలు పాల్గొన్నారు. పెన్షన్ సెటిల్మెంట్‌కు సంబంధించిన పెండింగ్ కేసులను పూర్తిగా నివారించడం, అర్హులైన ప్రతి కార్మికుడికి సమయానికి సామాజిక భద్రత అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. సమావేశంలో సిఎంపిఎఫ్ అధికారులు, సింగరేణి యాజమాన్యం ప్రతినిధులు, పర్సనల్ విభాగం అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.ప్రయాస్ ద్వారా పెన్షన్ క్లెయిమ్ ప్రక్రియను సరళీకరించి, పారదర్శకతను పెంచి, సమయపాలనతో సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పెన్షన్ క్లెయిమ్ దాఖలు విధానం, అవసరమైన పత్రాలు, ఆన్లైన్-ఆఫ్లైన్ ప్రక్రియలు, పరిశీలనలో ఎదురయ్యే సమస్యలపై సవివరంగా చర్చించారు.డాక్యుమెంటేషన్ లోపాలు, వివరాల అసంపూర్ణత, సాంకేతిక సమస్యల వల్ల పెండింగ్ అవుతున్న కేసులను గుర్తించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. అవసరమైన పత్రాలను సమయానికి సమర్పించడం, వివరాలను సరిగా నమోదు చేయడం ద్వారా క్లెయిమ్‌లను వేగంగా పరిష్కరించుకోవచ్చని సూచించారు. సిఎంపిఎఫ్, సింగరేణి మధ్య సమన్వయం బలోపేతం చేస్తే ఉద్యోగులకు మెరుగైన సేవలు అందుతాయని ఈ సందర్భంగా సమావేశంలో అధికారులు తెలిపారు. సమావేశంలో బాధ్యతల పంపిణీ, కాలపరిమితుల నిర్ణయం, ఫాలోఅప్ చర్యలపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రతి స్థాయిలో బాధ్యతాయుతంగా పనిచేస్తే ప్రయాస్ కార్యక్రమం విజయవంతమవుతుందని అధికారులు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిజిఎం సివిల్ జి శివ ప్రసాద్, ఏఐటీయూసి బ్రాంచ్ సెక్రటరీ వైరాంగోపాల్, ఐఎన్టీయూసి వైస్ ప్రెసిడెంట్ వత్సవాయి కృష్ణంరాజు, సిఎంపిఎఫ్ సిబ్బంది సీతారాం, సత్యనారాయణ రాజు, డివై ఎస్ఈ సివిల్ డివిఎస్ఎన్ ప్రవీణ్, సీనియర్ పర్సనల్ అధికారులు ఎస్ చంద్రకిరణ్, వంశీకృష్ణ, సాయి మానిక, గనుల వెల్ఫేర్ విభాగాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.పెన్షన్ పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని అధికారులు తెలిపారు. కార్మికుల సంక్షేమం కోసం ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయాలి

**ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**



**పినపాక,మహా:** పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రభుత్వ పథకాలను ప్రజలకు సమర్థంగా చేరవేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. గురువారం పినపాక మండలం ఈ బయ్యారం క్రాస్ రోడ్‌లోని జీవిఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన 99 రోజుల ప్రజా పాలన –ప్రగతి ప్రణాళిక మండల స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లక్ష్యం ప్రతి అర్హులైన లబ్ధిదారునికి ప్రయోజనం చేరేలా చేయడమేనని అన్నారు. అయితే, పథకాలపై పూర్తి అవగాహన లేకపోవడం వల్ల కొంతమంది అధికారులు సక్రమంగా అమలు చేయడంలో విఫలమవుతున్నారని పేర్కొన్నారు. అధికారులు తమ శాఖల పరిధిలో ఉన్న పథకాల పై పూర్తిగా అవగాహన పెంపొందించుకుని, వాటిని ప్రజలకు చేరువ చేయడంలో బాధ్యతగా వ్యవహరించాలని ఆయన సూచించారు.సమీక్ష సమావేశంలో వివిధ శాఖల అధికారులను అడిగి ఆయా శాఖల్లో అమలవుతున్న పథకాల అమలు పరిస్థితులు, లబ్ధిదారుల వివరాలు, ఎదురవుతున్న సమస్యలను ఎమ్మెల్యే తెలుసుకున్నారు. ముఖ్యంగా విద్య, ఆరోగ్యం, విద్యుత్, వ్యవసాయం, సంక్షేమ శాఖల పనితీరును సమీక్షిస్తూ, ఎక్కడైనా లోపాలు ఉన్నా వెంటనే సరిచేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల లబ్ధి అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.అనంతరం కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ఎమ్మెల్యే వివరించారు. పేదల సంక్షేమం, విద్యాభివృద్ధి, ఆరోగ్య పరిరక్షణ, మహిళా సాధికారత వంటి అంశాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ పథకాలను ప్రజలకు మరింత విస్తృతంగా చేరవేసే బాధ్యత అధికారులతో పాటు ప్రజాప్రతినిధులపై కూడా ఉందని అన్నారు. ప్రజల సమస్యలను సమయానికి పరిష్కరించడం ద్వారా ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతుందని, అందుకు ప్రతి అధికారి కట్టుబడి పనిచేయాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచించారు. అనంతరం అంగన్వాడి టీచర్లకు స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేశారు. ఈ సమావేశంలో మండల స్పెషల్ ఆఫీసర్ తాతారావు, తాసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఏపీవో వీరభద్రస్వామి, ఏవో వెంకటేశ్వర్లు, ఎస్ఐ సురేష్, ఎంఈఓ నాగయ్య, భగీరథ ఎఈ ప్రవీణ్ ,వివిధ శాఖల ఏఈలు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రామనాథం,23 గ్రామ పంచాయతీల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు, మండల ప్రజలు , కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, సంక్షేమ పథకాల లబ్ధిదారులు పాల్గొన్నారు.

## సమస్యలను గుర్తించి పరిష్కరించడం ద్వారా

# నిజమైన ప్రజా పాలన సాధ్యం

**మంచిర్యాల జిల్లా డిసిసి ఉపాధ్యక్షుడు బొమ్మన హరీష్ గౌడ్**



**బెల్లంపల్లి మహా:** క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరించడం ద్వారా నిజమైన ప్రజా పాలన సాధ్యం అవుతుందని మంచిర్యాల జిల్లా డిసిసి ఉపాధ్యక్షుడు బొమ్మన హరీష్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం నాడు మండల కేంద్రంలో ఏర్పాటు చేసినప్రజా పాలన ప్రగతి ప్రణాళిక - మండల స్థాయి కార్యక్రమం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ ప్రజల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూపొందించిన పథకాలను ప్రతి ఇంటికీ చేరేలా కృషి చేయాలని, గ్రామ స్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కరించడం ద్వారా నిజమైన ప్రజా పాలన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల ప్రభుత్వ అధికారులు స్పెషల్ ఆఫీసర్ రవూఫ్ ఖాన్, ఎంపీడీవో, ఎంఆర్ఓ, ఏపీఓ, ఏఓ, ఫారెస్ట్ శాఖ అధికారులు, కరెంట్ ఏఈ, ఆర్‌డబ్ల్యూఏఈ, పంచాయతీరాజ్ ఏఈ,ఎంఈఓ,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గట్టు మల్లేశ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గురునాధం మల్లా గౌడ్, సర్పంచులు జింజిరీ సీతారాం,జాడి రాజ్ కుమార్, గన్నా సతీష్, గొలుసుల శిరీష, సింగతి రాణి, కామెర వనిత,ఉప సర్పంచ్ లు & వార్డు సభ్యులు ,మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోలేటి సంధ్య రాజారాం, వివిధ గ్రామ పంచాయతీల కార్యదర్శులు, పోలీస్ అధికారులు, ఐకేపీ సిబ్బంది, జీపి వర్కర్లు, ప్రజలు హాజరయ్యారు.

# ప్రజా పాలన 99 రోజుల ప్రణాళికతో అభివృద్ధికి వేగం..

**ఐటిడిఏ పిఓ రాహుల్..**



**మణుగూరు, మహా :** ప్రజా పాలన, ప్రజా ప్రణాళికలో భాగంగా మణుగూరు కిన్నెర కళ్యాణ మండపంలో గురువారం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఐటిడిఏ పిఓ రాహుల్ హాజరై కార్యక్రమాన్ని సమీక్షించారు. ఈ సందర్భంగా పిఓ రాహుల్ మాట్లాడుతూ.. ప్రజా పాలన 99 రోజుల ప్రణాళిక ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు అవసరమైన సేవలను సమయానికి అందించడం, సంక్షేమ పథకాలను అర్హులకు చేరవేయడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మహిళా సంఘాల ఆర్థిక సాధికారతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని, స్వయం సహాయక సంఘాల ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. సమావేశంలో అంగన్వాడి టీచర్లకు మొబైల్ ఫోన్లు పంపిణీ చేయడంతో పాటు 24 స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.2 కోట్లు 16 లక్షల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కులను ఐటిడిఏ పిఓ రాహుల్ అందజేశారు. ఈ రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని మహిళలకు సూచించారు. గ్రామ స్థాయిలో సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి శాఖ తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తేనే ప్రజా పాలన లక్ష్యాలు నెరవేరుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సమితి సింగారం సర్పంచ్ మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నవీన్, ప్రత్యేక అధికారి లెనినా, తాసిల్దార్ అద్దంకి నరేష్, ఎంపిఓ పల్నాటి వెంకటేశ్వర్లు, ఎంఈఓ జ్యోతి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# మండల స్థాయి అధికారులకు ప్రోటోకాల్ తెలియదా....?

**ఏయంసి చైర్మన్ ప్రోటోకాల్ రగడ**



**దమ్మపేట,మహా :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99రోజుల ప్రజాపాలన ప్రగతి షెడ్యూల్ మండలస్థాయి సమీక్ష సమావేశంలో మార్కెట్ యార్డు చైర్మన్ గా ఉన్న వాసం రాణి అనే తనను ప్రోటోకాల్ లేకుండా అవమానించారని ఆమె సమావేశం నుండి వాకౌట్ చేశారు. గురువారం మండలంలోని మల్లారం రైతువేదికలో యంపిడివో రవీంద్ర రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఏయంసి చైర్మన్ రాణి కి సముచితమైన స్థానం కల్పించకుండా ,కేవలం ఓ గిరిజన మహిళ అనే చిన్న చూపుతో వేదికపై అవమానించారని ఆరోపించారు. సమావేశం మధ్యలో నుండి వాకౌట్ చేసిన అనంతరం మహా పత్రిక తో మాట్లాడారు. మంత్రులు ,ఎంఎల్ఏ సభలలో దక్కుతున్న ప్రోటోకాల్ గౌరవం ,మండల స్థాయి సమావేశాలలో కనీసం దక్కడం లేదని ఆవేదన చెందారు. అశ్వారావుపేట ,ములకలపల్లి, దమ్మపేట మండలాల రైతుల కు మార్కెట్ కమిటీ చైర్మన్ గా కాంగ్రెస్ పార్టీ నియమించిన సంగతి స్థానిక మండల అధికారులు మరచిపోయి , నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ,కేవలం ఒక గిరిజన మహిళ తమ ప్రక్కన ఆసీనులైతే అధికారులకు చిన్నతనం ఉంటుందనేమో అనే నెపంతో దూరంగా కూర్చోబెట్టి అవమానించారని గాద్గ స్వరంతో విలపించారు. ఏది ఏమైనప్పటికీ అధికారుల తీరుపై స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ దృష్టికి ఈ విషయాన్ని అధికారికంగా ఫిర్యాదు చేస్తానని ఆమె తెలిపారు. ఈ విషయమై యంపిడివో రవీంద్ర రెడ్డి ని వివరణ కోరేందుకు యత్నించగా అందుబాటులో లేరు.

# గురువు ఇంటికి వచ్చిన ఎమ్మెల్యే



**పినపాక, మహా:** గురువు ఇంటికి వచ్చిన ఎమ్మెల్యే పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తనకు హైస్కూల్లో తెలుగు ఉపాధ్యాయుడిగా విద్య నేర్పిన ఎర్రాప్రగడ రామమూర్తి ఇంటికి గురువారం వచ్చారు . తన ఇంటికి వచ్చిన శిష్యుడుని రామమూర్తి పుష్పగుచ్ఛం అందించి ఘనంగా శాలువాతో సత్కరించారు. అనంతరం గురువుగారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న పాయం వెంకటేశ్వర్లు రానున్న మే 10వ తేదీన నిర్వహించనున్న మాస్టారు రాసిన పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమానికి తప్పకుండా వస్తాను అని తెలిపారు. చాలా కాలం తర్వాత గురువుగారిని కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో పినపాక సర్పంచి అరిగెల అలివేలు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రామనాథం, నాయకులు గంగిరెడ్డి వెంకటరెడ్డి, కంది విజయభారత్ రెడ్డి, నవీన్, ప్రభాకర్, పాషా తదితరులు పాల్గొన్నారు

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మండల స్థాయి సమావేశం....

- అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు
- అడిషనల్ కలెక్టర్, చంద్రారెడ్డి

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ సర్కిల్ పరిధిలోని వైవైఎన్ఆర్ గార్డెన్ లో గురువారం ఎంపీడీవో మున్ని ఆధ్వర్యంలోప్రజా పాలన ప్రగతి ప్రణాళిక, మండల స్థాయిలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి, మండల నోడల్ ప్రత్యేక అధికారి ఉషారాణి, తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కోఆపరేటివ్ సొసైటీ కార్పొరేషన్ చైర్మన్ బోర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, శంషాబాద్ ట్రాఫిక్ ఏసిపి నాగభూషణం, ఎమ్మార్వో రవీందర్ దత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో కార్యచరణ, సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులు సమగ్రంగా చదివి వినిపించారు.అర్రైవ్, ఆలైవ్ కార్యక్రమంలో రోడ్డు భద్రత,హెల్మెట్ ధరించడంపై పోలీసులు ప్రజలకు, ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులకు పూర్తి అవగాహన కల్పించారు. వివిధ గ్రామాల సర్పంచ్లు, వార్డు సభ్యులు ప్రజలు, అధికారులతో ట్రాఫిక్ అవగాహన రోడ్డు భద్రత విషయంలో ప్రతిజ్ఞ చేయించారు. ఇందులో 5 దాపాలుగా సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. మొదటిది గ్రామస్థాయిలో, రెండవది మండల స్థాయిలో, మూడవది నియోజకవర్గస్థాయిలో, నాల్గవది జిల్లా స్థాయిలో, ఐదవది రాష్ట్రస్థాయిలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామన్నారు. మార్చు 6 తేదీన నుంచి జూన్ 12 వరకు ఉంటుందన్నారు.ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ మాట్లాడుతూ పది సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చాక రేషన్ కార్డుల ప్రక్రియను నిరంతర ప్రక్రియగా నడుస్తుందన్నారు. అభివృద్ధిలో మహిళలు ముందడుగు ముందంజలో ఉంటారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అనేక సంక్షేమ పథకాల్లో మహిళలకు పెద్దపీట వేస్తుందన్నారు. అనేక సంక్షేమ పథకాలకు మొదటి ప్రాధాన్యతను తమ ప్రభుత్వం మహిళలకుఇస్తుందన్నారు.

**మహిళ సంఘాల బలోపేతనికి ప్రభుత్వం కృషి..**

మహిళా సంఘాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను మహిళలకు అందజేస్తున్నాము. సంఘాల బలోపేతానికి స్వయం ఉపాధి అవకాశాల పెంపులో రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. ఆర్థికంగా స్వయం ఉపాధి పథకాలతో మహిళలు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తుందన్నారు. శంషాబాద్ మండల సమాఖ్యలోని 700 మహిళ స్వయం సహాయక సంఘాలకు 53 కోట్ల 93 లక్షల 24 వేల రూపాయల చెక్కును మహిళా సంఘాలకు అందజేశారు. కార్యక్రమంలో సిఐ నరేందర్ రెడ్డి, ఎంపీ ఓ రమేష్ గౌడ్, విద్యుత్ శాఖ అధికారులు, వివిధ శాఖల అధికారులు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలను నివారించడమే

# రోడ్డు భద్రత వారోత్సవాల లక్ష్యం




**.. మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు**

**బెల్లంపల్లి ,మహా:** రోడ్డు ప్రమాదాల నివారించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు పేర్కొన్నారు. గురువారంనాడు బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు, బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయంలో టూ టౌన్ ఎస్ఐ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో 'అరైవ్_అలైవ్' 2026 కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన రోడ్డుభద్రత అవగాహనా సదస్సులో బెల్లంపల్లిమున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతిరమేష్ బాబు తోపాటు మున్సిపల్ కమిషనర్ సంపత్ రెడ్డి పాల్గొని మున్సిపల్ కార్యాలయం నుండి బెల్లంపల్లి టూ టౌన్ పరిధిలో రోడ్డుపై హెల్మెట్ ధరించి వాహనాలతో రోడ్డు భద్రత అవగాహనర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్ పర్సన్ దావ స్వాతిరమేష్ బాబు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నునివారించడమే కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు.వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అదేవిదంగా కారులో ప్రయాణించే వారు సీటు బెల్ట్ ధరించాలన్నారు.. ఏ వాహనదారులు మద్యంసేవించి వాహనాలు నడపవద్దని సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణ కొరకు పోలీసులు చేస్తున్న కృషిని ఈ సందర్భంగా ప్రశంసించారు..కార్యక్రమంలో మున్సిపల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




# నీటి ఎద్దడి దృష్ట్యా బోర్ పంపు మోటార్ ఏర్పాటు

**... లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో**

**బెల్లంపల్లి మహా:** బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకట స్వామి ఆదేశాల మేరకు మున్సిపాలిటీలోని 10వ వార్డులో లయన్స్ క్లబ్ ఆఫ్ బెల్లంపల్లి సహకారంతో నీటి ఎద్దడి దృశ్య బోర్ మోటార్ పంపును ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ చైర్మన్ దావ స్వాతి రమేష్ పేర్కొన్నారు.వార్డ్ కౌన్సిలర్ డికొండ పద్మరాయలింగు ఆధ్వర్యంలో నూతన బోర పంపు ఏర్పాటు చేసిన నూతన బోర్ మోటార్ పంపింగ్ నకు పూజాది కార్యక్రమాలు నిర్వహించి వారు మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా నీటిని పొదుపుగా వాడుకుంటూ సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని వార్డుప్రజలకు సూచించారు.



# గ్రామపంచాయతీకి పన్ను చెల్లించిన దేవాదాయశాఖ

**కారేపల్లి, మహా :** దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో కారేపల్లిలో నిర్వహిస్తున్న సంతకు సంబంధించి వివాదం సర్దుమణిగింది. పంచాయతీ పాలకవర్గం, దేవాదాయశాఖ అధికారులు, గ్రామస్తుల సమక్షంలో జరిగిన చర్చలలో పన్ను బకాయి క్రింద రూ.2లక్షలు చెల్లించాలని తీర్మానించారు. అట్టి తీర్మాణం అనుసరించి గురువారం దేవాదాయ శాఖ అధికారులు మొదటి విడుతగా రూ.ఒక లక్షల చెక్‌ను ఆలయం ఇంచార్జీ మూడు మోహన్ చౌహాన్ సింగరేణి గ్రామ పంచాయతీ సర్పంచ్ మేదరి వీరప్రతాఫ్(టోనీ), కార్యదర్శి నెహ్రు కు అందజేశారు. దీంతో కొంతకాలం దేవాదాయశాఖ, గ్రామపంచాయతీ మధ్య వివాదం సర్దుమణిగింది.

## తిలక్ గ్రౌండ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబలి పంపిణీ

**సేవా కార్యక్రమాలను ప్రశంసించిన బెల్లంపల్లి వన్టౌన్ సిఐ శ్రీనివాసరావు**



**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి పట్టణానికి చెందిన తిలక్ వాకర్ అసోసియేషన్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని బెల్లంపల్లి వన్ టౌన్ సిఐ శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారంనాడు కాంటాచౌరస్తాలోఏర్పాటుచేసిన అంబలి పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన ప్రారంభించారు. వేసవికాలంలో అంబలి పంపిణీ కార్యక్రమం చేపట్టడం శుభ పరిణామని, వడదెబ్బ తగలకుండా ఉండేలా అంబలి ని పంపిణీ చేయడం తిలక్ వాకర్ అసోసియేషన్ ప్రత్యేకత అని పేర్కొన్నారు.సేవా కార్యక్రమాలను మరింతగా విస్తరించాలని ఆయన ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సుమారు 500 మందికిఅంబేద్కర్(కాంట) చౌరస్తా మార్కెట్ ఏరియాలో భవన నిర్మాణ కార్మికులకు నిరుపేదలకు,కూలీలకు,ఆటోడ్రైవర్స్,బాటసారులకు, చిరు వ్యాపారస్తులకు ఉచితంగా అంబలి పంపిణీ చేయడం జరిగింది.అంబలి పంపిణీ 22వరోజు దాత కొండ శ్రీనివాస్ (మందమరి) సహకారంతో పంపిణీ చేశారు. కార్యక్రమంలో తిలక్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కంటెవాడ నాగేష్ కుమార్,గంటా శ్రీనివాస్,గరిగె రాజ్కుమార్,ఏనుగునరేష్, కుమార్, నాగుల లింగయ్య,తిప్పారపు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

**బీఎస్పీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు రాజేంద్రప్రసాద్**



**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లా విద్యుత్ శాఖ లో విధులు నిర్వహిస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని బీఎస్పీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, పెద్దపల్లి పార్లమెంటు ఇంచార్జ్ రవీందర్ లు డిమాండ్ చేశారు. గురువారం మంచిర్యాల జిల్లా విద్యుత్తు కార్యాలయం ముందు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల చేస్తున్న దీక్ష శిబిరాన్ని వారు సందర్శించి మద్దతు పలికారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ శాఖలో ఔట్సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలని వారు డిమాండ్ చేశారు.గత ప్రభుత్వం ఎక్కడలేని విధంగా ప్రత్యేక సర్వీస్ రూల్స్ తీసుకువచ్చి విద్యుత్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దారిలోనే ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వ నడుస్తుందని దుయ్యబట్టారు.కర్ణాటక రాష్ట్రంలో ఉమాదేవి కేసును ప్రస్తావిస్తూ ఎమర్జెన్సీ సంస్థలో పనిచేస్తున్న వారందరినీ పర్మినెంట్ చేయాలని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పోకుండా ఎమర్జెన్సీ సంస్థలను దృష్టిలో పెట్టుకొని మానవత్వంతో వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈసీ సభ్యులు ఎండి మతిన్ ఖాన్, మందమర్రి పట్టణ అధ్యక్షులు గాజుల శంకర్, నాయకులు ఆయిల్ల లక్ష్మణ్, అడ్వకేట్ నటేశ్వర్ లు ఉన్నారు.

## ప్రజలు ఇబ్బందులు పడకుండా అవసరం ఉన్న చోట
# అండర్ డ్రైనేజ్ ఏర్పాటు చేస్తాం

**బాకారం గ్రామ సర్పంచ్ ఎల్గని వెంకటేష్ గౌడ్**



**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మండలం లోని బాకారం జాగీర్ గ్రామంలో అండర్ డ్రైనేజ్ లు ప్రజల అవసరం నిమిత్తం వార్డులలో డ్రైనేజీలు లేక ఇబ్బందులు పడుతున్న వార్డులను గుర్తించి అండర్ డ్రైనేజ్ పనులు చేపట్టడం జరుగుతుందని గ్రామ సర్పంచ్ ఎల్గని వెంకటేష్ గౌడ్ తెలిపారు. గురువారం గ్రామాల్లో అండర్ డ్రైనేజ్ పనులను గ్రామ సర్పంచ్ ఎల్గని వెంకటేష్ గౌడ్ ఆదేశానుసారం ఉపసర్పంచ్ సుభాష్ చంద్రబోస్ రెడ్డి వార్డు సభ్యుల ఆధ్వర్యంలోలో అండర్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా గ్రామంలో ఉన్న సమస్యలన్నీటిని ఒక్కొక్కటిగా తీర్చుకుంటూ ముందుకు వెళ్తామని గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుభాష్ చంద్రబోస్ రెడ్డి, వార్డు సభ్యులు కొంతం నాగేశ్వర్ రెడ్డి, గ్రామస్తులు శ్రీకాంత్, నరసింహ, సురేందర్, నరేందర్, కష్పా శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎయిర్ టెల్ టవర్ నిర్మాణ పనులు నిలిపివేయాలి



**మందమర్రి, మహా :** మందమర్రి సింగరేణి పాఠశాల మైదానంలో నిర్మిస్తున్న ఎయిర్ టెల్ టవర్ పనులను నిలుపుదల చేయాలని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు గురువారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వాకర్స్ మాట్లాడుతూ సింగరేణి పాఠశాలలో దాదాపు 800 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు. అయితే ఈ పాఠశాల పక్కన ఎయిర్ టెల్ టవర్ నిర్మాణ పనులు పూర్తయి వినియోగంలోకి వస్తే రేడియేషన్ వెదజల్లి విద్యార్థులకు ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని ఆరోపించారు. పాఠశాల ప్రక్కన కాకుండా మరో కాడ నిర్మాణ పనులు చేపడితే పాము అడ్డగించబోమని వెల్లడించారు. ఈ విషయంపై గత సోమవారం మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు వారు స్పష్టం చేశారు. అలాగే స్థానిక జిఎం ఎన్ రాధాకృష్ణకు కూడా రేడియేషన్ ప్రభావం గురించి తెలిపినట్లు చెప్పారు. అయినప్పటికీ యథావిధిగా టవర్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు కాలుష్య నియంత్రణ కొరకు ప్రజలకు, మొక్కలను పెంచాలని సూచనలు చేస్తున్న సింగరేణి సంస్థ నేడు రేడియేషన్ వెదజల్లే సంస్థలకు మద్దతు పలకడం సిగ్గుచేయడానికి అన్నారు.ఈ పనులను నిలుపుదల చేయని పక్షంలో పట్టణ ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, మేధావులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

## 14వ వార్డులో వెలుగులు నింపిన కౌన్సిలర్ శ్రీధర్

**చీకటి కష్టాలు పాముల బెడద తొలగిందన్న స్థానికులు**



**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సురంగల్ 14వ వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న చీకటి కష్టాలు తొలగిపోయాయి. వార్డు కౌన్సిలర్ కర్రోల్ల శ్రీధర్ చొరవతో నూతన వీధి దీపాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా 14వ వార్డులో పర్యటించినప్పుడు క్వార్టర్స్‌లో నివసించే ప్రజలు, స్థానికులు వీధి దీపాలు లేక రాత్రిపూట తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కౌన్సిలర్‌కు విన్నవించారు. గెలిచిన వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు గెలిచిన వెంటనే మొదటి మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశంలోనే వార్డులో 80 లైట్లు అవసరమని కౌన్సిలర్ శ్రీధర్ ప్రస్తావించారు. దీంతో ప్రస్తుతానికి 50 వీధి లైట్లు మంజూరయ్యాయి. గత రెండు రోజులుగా వార్డులో పాడైపోయిన లైట్లను రిపేర్ చేయించడంతో పాటు, మరమ్మతుకు వీలుకాని చోట్ల నూతన లైట్లను బిగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వార్డులోని వాటర్ ట్యాంక్ వద్ద కొత్తగా ఏర్పడిన కాలనీలో ఖాళీ స్థలాలు, చెట్లపొదలు ఎక్కువగా ఉన్నాయి. వేసవి కాలంలో సాయంత్రం వేళ బయట కూర్చునే సమయంలో చీకటి కారణంగా పాములు, తేళ్లు వస్తున్నాయని, ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు లైట్లు బిగించడంతో ఆ సమస్య తీరిందని వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కర్రోల్ల శ్రీధర్ మాట్లాడుతూ, ఎన్నికల్లో భాగంగా ప్రజలు అడిగిన ప్రతి సమస్యను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ముందుకెళ్తాను. ఎల్లప్పుడూ ప్రజలకు జవాబుదారీగా ఉంటాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో బుర్ర బిచ్చమయ్య, సోమ వెంకటేష్, ఎల్గని లోకేష్‌గౌడ్, ఎలుగని శ్రీకాంత్ గౌడ్, మున్సిపల్ సిబ్బంది, మున్సిపాలిటీ విద్యుత్ వర్కర్లు పాల్గొన్నారు.

# వ్యాధుల నియంత్రణలో దోమల వృద్ధిని నివారించాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, మహా :** వ్యాధుల నియంత్రణలో దోమల వృద్ధిని నివారించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసన కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ వేదవ్యాస్, టిహబ్ ప్రతినిధి డాక్టర్ శిల్ప లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 16 నుండి మే 15 వరకు జిల్లాలో వెక్టర్‌బోర్న్ వ్యాధుల నివారణకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. దోమలు, టిక్స్, ఫ్లీలు ద్వారా వ్యాప్తి చెందే మలేరియా, డెంగ్యూ, ఫైలేరియా వంటి వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి వాటిని నివారించేందుకు వైద్య శాఖ ముందుండి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లా, మండల స్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సరిపడా నిధులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. గ్రామాలు, పట్టణాలలో గుంతలు పూడ్చడం, మురుగు కాలువలు శుభ్రపరచడం, నిల్వ నీరు తొలగించడం వంటి పనులు క్రమం తప్పకుండా చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ విద్యా సంస్థలు, సంక్షేమ వసతి గృహాలలో ప్రత్యేక శుభ్రత కార్యక్రమాలు చేపట్టి, నెలవారీ ప్రణాళికను అమలు చేయాలని తెలిపారు. జూన్ 12న విద్యా సంవత్సరం పునః ప్రారంభమయ్యే నేపథ్యంలో పాఠశాలలలో 23 రోజుల ముందు శుభ్రపరిచే పనులు పూర్తి చేయాలని చెప్పారు. రాబోయే వర్ష కాలాన్ని దృష్టిలో ఉంచుకొని దోమల నివారణ చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా నిల్వ నీరు ఉండకుండా చర్యలు తీసుకోవాలని వెల్లడించారు. జూన్ 5 నుండి 15 వరకు మరొక దశలో వైద్య శాఖ చర్యలు కొనసాగించాలని అన్నారు.జిల్లాలో మందులు, ద్రావణాలు, పడకలు సమృద్ధిగా ఉన్నాయని, మండల స్థాయిలో సిబ్బంది రోగులకు తగిన సేవలు అందించాలని ఆదేశించారు. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాల పరిధిలోని గ్రామాలలో నెల రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, కీటక దళిత వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టడం, దోమల వృద్ధిని అరికట్టడం, దోమల ద్వారా వచ్చే వ్యాధులను నియంత్రించడం కొరకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నివాసాలలో దోమతెరలు, ఇంటి కిటికీలకు జాలీలు వాడటం, ఇంటి ఆవరణలో, నీళ్ళకుండీలు, బావుల వద్ద పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. బోదకాలు నివారణకు జిల్లాలో సంవత్సరానికి ఒక మోతాదు డిఇసి మాత్రలు వాడడం వ్యాధిగ్రస్తులకు ఉపశమనం కలిగిస్తుందని వివరించారు. జిల్లాలోని తెలంగాణ డయాగ్నొస్టిక్స్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు జిల్లాలో వైద్య శిబిరమును ఏర్పాటు చేసి వ్యాధిగ్రస్తులను గుర్తించి తగు వైద్య చికిత్స అందించాలని తెలిపారు. వేసవి అయినందున వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. మధ్యాహ్నము 12 గంటల నుండి 4 గంటల మధ్యలో ఎండ తీవ్రత అధికంగా ఉన్న కారణంగా ప్రజలు తమ నివాసాల నుండి బయటకు రావద్దని హెచ్చరించారు.అన్ని గ్రామాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు గొడుగు, తెల్లటి నూలు వదులు దుస్తులు ధరించాలన్నారు. తలపై టోపీ, రుమాలు ధరిస్తే ఉపశమనం కలుగుతుందని చెప్పారు.ఎట్టి పరిస్థితులలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రజలు తమ నివాసాల నుండి బయటకు రావద్దని చెప్పారు. ఒకవేళ వస్తే వారికి వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందని తెలిపారు. విధులలో నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం కార్యక్రమాల సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ ప్రశాంతి, సబ్ యూనిట్ అధికారి సిహెచ్ వెంకటేశ్వర్లు, ఎం.టి.ఎస్. శ్రీనివాస్, కిరణ్, ఆర్ఎస్ పద్మ వసుమతి, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

## సీపీఐ(ఎం) నాయకులు
## పెద్ద బక్కయ్య మృతి



**కారేపల్లి, మహా :** కారేపల్లి మండలం ఉరిసికాయలపల్లి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు గడ్డం పెద్దబక్కయ్య(68) గురువారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయన మృతదేహాన్ని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండెబోయిన నాగేశ్వరరావు, మండలకార్యదర్శి కే.నరేంద్ర నాయకులు వజ్జా రామారావు, దాసరి మల్లయ్య, బానోత్ బన్సీలాల్, తేజావత్ చందర్ లు నివాళ్లు అర్పించారు.

## పోలీసు ఆధ్వర్యంలో
## ఉచిత కంటి పరిక్ష శిభిరం



**దమ్మపేట ,మహా :** దమ్మపేట పోలీసు శాఖ ఆద్వర్యంలో నేడు శుక్రవారం ఉచిత కంటి పరిక్ష శిభిరం నిర్వహించనున్నట్లు పోలీస్ ఎసై .సాయికిషోర్ రెడ్డి ఓ ప్రకటన లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో ఉన్న శ్రీ వినాయక ఫంక్షన్ హాల్ యందు నిర్వహించ తలపెట్టిన ఉచిత కంటి పరిక్ష శిభిరానికి ముఖ్య అతిధులుగా పోలీస్ ఐజి .చంద్రశేఖర్ రెడ్డి ,జిల్లా యస్పీ .రోహిత్ రాజు లు హాజరుకానున్నారని తెలిపారు. శిభిరం అనంతరం పోలీసు వారు నిర్వహించే రోడ్డు భద్రతా వారోత్సవాల లో భాగంగా ఎరైవ్ అండ్ ఎలైవ్ కార్యక్రమంలో ప్రజలకు భద్రత పై అవగాహన కల్పిస్తారని తెలిపారు. కావున ప్రజలందరూ అధిక సంఖ్యలో హాజరవ్వాలని కోరారు.



## అన్యాయపు అక్రమ కేసులకు
## భయపడేది లేదు!

- న్యాయ వ్యవస్థపై విశ్వాసం చివరికి నిజం గెలుస్తుంది
- బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డిజిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అధిక కౌన్సిలర్ల గెలుపుతో కలిగిన అక్కసుతో, కాంగ్రెస్ పార్టీ రాజకీయ కక్షసాధింపులో భాగంగా వేసిన అక్రమ కేసులు కారణంగా హైకోర్టు ఆదేశాల మేరకు గురువారం ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి హాజరైన బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి) మాట్లాడుతూ..."ఎన్ని అక్రమ కేసులు పెట్టినా... ఎన్ని ఒత్తిడులు తెచ్చినా... భయపడేది లేదు, బెదిరేది లేదు!" అని స్పష్టం చేశారు. న్యాయ వ్యవస్థపై పూర్తి విశ్వాసంతోనే హాజరయ్యామని, నిజం చివరకు గెలుస్తుందని తెలిపారు. ప్రజా తీర్పును జీర్ణించుకోలేక అధికార దుర్వినియోగంతో కేసులు పెట్టడం కాంగ్రెస్ అసహన రాజకీయాలకు నిదర్శనం అని మండిపడ్డారు. "మీరు వేసే అక్రమ కేసులు, చేసే అక్రమ పనులు అన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారు... సరైన సమయంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారు" అని మంచిరెడ్డి హెచ్చరించారు.

## విద్యుత్ ఆర్టిసన్ కార్మికులకు
## సంఘీభావం తెలిపిన బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు..



**రాజేంద్రనగర్ మహా ;** తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఏక్తా కాలనీ విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయం ముందు ఆర్టిసన్ కార్మికులు గురువారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. విద్యుత్ ఆర్టిసన్ కార్మికులకు బిఆర్ఎస్, బిజెపి పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ నాయకులు కార్తీక్ రెడ్డి, తోకల శ్రీనివాస్ రెడ్డి సంఘీభావం తెలిపారు. కార్మికులు తమను రెగ్యులర్ చేయాలని గత తొమ్మిది రోజులుగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రెండు పార్టీల నాయకులు కార్మికులకు అండగా ఉంటామన్నారు. విద్యుత్ ఆర్టిసన్ కార్మికులకు ఇచ్చిన మాటనుకాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి అధికారం చేపట్టిందన్నారు. మోసపూరితమైన వాగ్దానాలు చేసి ప్రజలను ప్రలోభాలకు గురిచేసి అధికారం చేపట్టిందన్నారు. అధికారం వచ్చాక తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తుందని దుయ్యబట్టారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ కార్మికులను రెగ్యులర్ చేసి ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలన్నారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఎస్ వెంకటేష్, రాజేంద్రనగర్ సర్కిల్ జేఏసీ సభ్యులు రాజు, స్వామి, కాజా పాషా, సీతారాం నాయక్, మహమ్మద్ జాంగిర్, రాములు, నాగేశ్వరరావు, వెంకటరమణ, జనార్ధన్, బొమ్మరాజు, నరసింహ, శంకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### శంషాబాద్ విమానాశ్రయంలో
## కస్టమ్స్ అధికారుల తనిఖీలు

**45 లక్షల విదేశీ కరెన్సీ స్వాధీనం...**

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అక్రమ కరెన్సీకి శంషాబాద్ కస్టమ్స్ అధికారులు బ్రేకు వేశారు. హాంగ్ కాంగ్ కు అక్రమంగా విదేశీ కరెన్సీని తరలిస్తున్న ఓ ప్రయాణికున్ని కస్టమ్స్ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి కాధ్యేఫసిక్ విమానంలో హాంగ్ కాంగ్ కు వెళ్లేందుకు సిద్ధమైన ఓ ప్రయాణికుని ప్రవర్తనపై అనుమానం కలిగిన అధికారులు అతని లగేజ్ ని క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించగా అతని వద్ద ఎలాంటి అనుమతులు లేని సుమారు 45 లక్షల విలువైన విదేశీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. విదేశీ కరెన్సీ నియంత్రణ చట్టం క్రింద కేసు నమోదు చేశారు. భారీ విదేశీ కరెన్సీని ఎక్కడి నుంచి తీసుకొచ్చారు. దీని వెనకాల ఎవరైనా ఉన్నారా అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేపట్టారు.

# పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

- **99 రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి**
- **అధికారులు సమన్వయంతో ప్రజల సమస్యలు పరిష్కరించాలి**
- **ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథరెడ్డి**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** నిరుపేదలకు ప్రభుత్వం అందించే పలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథరెడ్డి అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన మండల పరిషత్ కార్యాలయ సమావేశానికి కే గురునాథరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై, జిల్లా ప్రత్యేక అధికారి నవీన్ రెడ్డితో కలిసి డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు చెక్కులను అందజేశారు. సిడిపిఓ వినీత దేవి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్ ను ఏఎంసీ చైర్మన్ సందర్శించారు. ఈ సందర్భంగా చైర్మన్ గురునాథరెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి పొలాల ప్రణాళిక లో భాగంగా 99 రోజుల యాక్షన్ ప్లాన్ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. రాష్ట్ర ప్రజలకు సంక్షేమం పట్ల సంక్షేమ పథకాల పట్ల ప్రత్యేక దృష్టి సారించి వారి అభివృద్ధికి కృషి చేస్తుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులు చేయాలని పథకంతో ముందుకెళ్తుందని అన్నారు. నిరుపేదలకు ప్రభుత్వం అందించే పలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. రెండో విడత ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం దృఢసంకల్పంతో ఉందని తెలిపారు. గత పది సంవత్సరాలుగా జరగని అభివృద్ధి రెండున్నర ఏళ్ల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని పలు గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించాలని సూచించాడు. గ్రామాలలో అధికారులు పర్యటించి క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు గుర్తించి స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకొస్తే తక్షణమే పరిష్కార మార్గం జరుగుతుందని అన్నారు. వేసవికాలంలో తాగునీటితో పాటు సమస్యలు తలెత్తకుండా సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. మండలంలోని పోచారం గ్రామం సమీపంలోని పలు గ్రామాలలో వ్యవసాయానికి విద్యుత్ సమస్యలు పరిష్కరించడానికి విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరైనదని అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం ఎమ్మార్వో ప్రత్యేక చొరవ తీసుకొని ప్రభుత్వ స్థలం కేటాయించినట్లయితే త్వరలో సబ్ స్టేషన్ పనులను ప్రారంభించడం జరుగుతుందని, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఉంటుందని మార్కెట్ కమిటీ చైర్మన్ అన్నారు. ఎంపీడీవో ప్రమీల మాట్లాడుతూ.... మండలంలోని పలు గ్రామాలలో ప్రజల మౌలికపై సమస్యలు పరిష్కరించడానికి, గ్రామపంచాయతీ కార్యదర్శులతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి తక్షణమే ప్రజల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గ్రామాలలో ప్రధానమైన సమస్యలు పెండింగ్లో ఉంటే స్థానిక పంచాయతీ కార్యదర్శులకు ఫిర్యాదు చేయాలని ప్రజలకు ఆమె సూచించారు. మండల తాసిల్దార్ సునీత మాట్లాడుతూ... మండలంలో అర్హులైన పేద ప్రజలకు రేషన్ కార్డులు మంజూరు చేయడం జరుగుతుందని అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె అన్నారు. అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేటట్లు కృషి చేస్తామని అన్నారు. ఇట్టి సమావేశానికి వచ్చిన ప్రజలు సందేహాలను తెలుపగా, ఎమ్మార్వో స్పందిస్తూ కప్పాడు గ్రామంలో ప్రభుత్వ భూమి వివాదంపై జిల్లా కలెక్టర్కు నివేదిక అందించడం జరుగుతుందని, త్వరలో సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని గ్రామస్తులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు.

ప్రధానంగా ఇబ్రహీంపట్నం సీఐ మాట్లాడుతూ... గ్రామాలలో శాంతిభద్రతలు పరిరక్షించడానికి ప్రజా ప్రతినిధులతో పాటు గ్రామస్తులు సహకరించాలని కోరారు. అలాగే గ్రామాలలో దొంగతనాలు నిర్మూలించడానికి స్వచ్ఛందంగా ప్రజా ప్రతినిధులు గ్రామ పెద్దలు ముందుకు వచ్చి సిసి కెమెరాలు ఏర్పాటుకు సహకరించాలని సూచించారు. స్టేషన్లో సరైన ఫోర్స్ లేకున్నా శాంతి భద్రతలను కాపాడడం జరుగుతుందని సీఐ అన్నారు. శాంతి భద్రతల విషయంలో గ్రామాల ప్రజలు పోలీసులకు సహకరించాలని, అప్పుడే పోలీసులకు ప్రజలకు ఫ్రెండ్లీ పోలీసింగ్ అనుబంధం ఏర్పడుతుందని ఆయన ప్రజలకు సూచించారు.

ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ సిఐ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రమాదాలను నివారించడానికి ట్రాఫిక్ రూల్స్ ను పాటించి సంతోషంగా గమ్యం చేరాలని ప్రజలకు సూచించాడు. పిల్లలకు తల్లిదండ్రులు మోటార్ సైకిల్ ఇచ్చే ముందు హెల్మెంట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. మహిళలు చెబితే కుటుంబ సభ్యులు వింటారని, మోటార్ సైకిల్ పై బయటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులకు చెప్పాలని సూచించారు. ప్రమాదాలు జరగకుండా హెల్మెట్ ను తప్పనిసరిగా ఉపయోగించాలని ఆయన అన్నారు.

వ్యవసాయ శాఖ అధికారి విద్యాదారి మాట్లాడుతూ... గ్రామాలలో ఆధునిక పరికరాలతో పాటు సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయం చేసి అధిక దిగుబడి పంటలు పొందాలని రైతులకు సూచించారు.

సిడిపిఓ వినితాదేవి మాట్లాడుతూ... గర్భిణీ స్త్రీలు బాలింతలు పోషకాలతో కూడిన ఆహార పదార్థాలు తూచా తప్పకుండా తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని బాలింతలకు సూచించారు. ఈ యొక్క సమావేశంలో వినితాదేవి ఆధ్వర్యంలో స్టాలు ఏర్పాటు చేసి గర్భిణీలు బాలింతలు తీసుకోవాల్సిన ఆహార పదార్థాలను ప్రదర్శించడం జరిగింది. పోషకాలతో కూడిన ఆహార పదార్థాలను తీసుకోవాలని మరోసారి కోరారు.
ఉపాధి హామీ ఏపిఎం తిరుపతా చారి మాట్లాడుతూ.... వేసవికాలంలో వ్యవసాయ కూలీలకు మౌలిక సదుపాయాలు తాగునీరు టెంట్ సౌకర్యం పరికరాలతో పాటు హెల్త్ కిట్స్ ఓఆర్ఎస్ పాకెట్లు అందజేస్తామని పేర్కొన్నారు.దండుమైలారం పిఎస్సి డాక్టర్ దివ్య మాట్లాడుతూ... 99 ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామాలలో హెల్త్ క్యాంపు నిర్వహించి, పలు వ్యాధులపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. గ్రామాలలో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు ఆశ వర్కర్ల ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందని డాక్టర్ దివ్య అన్నారు.ఈ కార్యక్రమంలో మండలంలోని గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు మెంబర్లు, మండల సూపర్డెంట్ జంగయ్య, విద్యుత్ శాఖ అధికారులు, మిషన్ భగీరథ అధికారులు, ఎంపీఓ, పలు గ్రామాల కార్యదర్శులు, ఇతర మండల అధికారులు పలు రాజకీయ పార్టీల నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ గౌరవాన్ని కించపరిచే విధంగా వ్యాఖ్యలు సహించం..

**బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచర్ల శ్రీనివాస్..**



**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచర్ల శ్రీనివాస్ మాట్లాడుతూబీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య పార్లమెంట్‌లో చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావాన్ని దేశ విభజనతో పోల్చడం చరిత్రను తప్పుదోవ పట్టించే చర్యగా ఆయన అభివర్ణించారు.తెలంగాణ ప్రజల దీర్ఘకాలిక పోరాటం ఫలితమే తెలంగాణ రాష్ట్రం, వేలాది మంది అమరవీరుల త్యాగాలతో సాధించిన స్వాభిమాన సంకేతమని శ్రీనివాస్ పేర్కొన్నారు. అలాంటి గొప్ప చరిత్రను వక్రీకరించేలా మాట్లాడటం తెలంగాణ ప్రజల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీస్తుందని అన్నారు.భారత రాజ్యాంగ పరిధిలో, పార్లమెంట్ ఆమోదంతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని గుర్తుచేస్తూ, దీనిపై సరైన అవగాహన లేకుండా బీజేపీ ఎంపీ ఈ వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనము. బీజేపీ నాయకులు తెలంగాణపై అపోహలు సృష్టించే విధంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. బీజేపీ లోక్‌సభ సభ్యుడు తేజస్విసూర్య వెంటనే ఈ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

# ప్రభుత్వం దిగివచ్చే వరకు పోరాటం ఆగదు బెదిరింపులకు భయపడేది లేదు.. టీవీఏఈ జేఏసీ

### 9వ రోజుకు చేరిన టీవీఏఈ జేఏసీ సమ్మె కొనసాగుతున్న అర్ధనగ్న ప్రదర్శనలు..

**నల్లగొండ, మహా :** తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీవీఏఈ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం నాటికి తొమ్మిదో రోజుకు చేరుకుంది. కార్మికుల సమస్యలపై సానుకూలంగా స్పందించాల్సిన ప్రభుత్వం మరియు యాజమాన్యం, వారిని విధుల్లోంచి తొలగిస్తామంటూ భయభ్రాంతులకు గురిచేయడాన్ని కార్మిక నేతలు తీవ్రంగా ఖండించారు. యాజమాన్యం అనుసరిస్తున్న ఇటువంటి మొండి వైఖరిపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ బెదిరింపులకు తలొగ్గకుండా భారీ సంఖ్యలో తరలివచ్చి తొమ్మిదో రోజు దీక్షను విజయవంతం చేశారు. ఈ క్రమంలో బుధవారం యాజమాన్యంతో జేఏసీ జరిపిన చర్చలు విఫలం కావడంతో తీవ్ర మనస్తాపానికి గురైన కార్మికుడు గోడ కొమ్మలు గుండెపోటుతో మరణించడం సమ్మె శిబిరంలో విషాదాన్ని నింపింది. మృతి చెందిన కార్మికుడి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ సమ్మెలో పాల్గొన్న వారంతా రెండు నిమిషాల పాటు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం తమ నిరసనను ఉధృతం చేస్తూ 12 మంది కార్మికులు అర్థనగ్న ప్రదర్శన చేపట్టి ఒకరోజు నిరాహార దీక్షకు దిగారు. కార్మికుల పోరాటానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి నేడు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. కార్మికులకు రావలసిన న్యాయమైన డిమాండ్ల సాధనలో తమ పార్టీ తరఫున పూర్తి సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జిట్టబోయిన లింగస్వామి, నాయకులు లింగారెడ్డి, పెరుమాళ్ల మురళి, విశ్వం, వేణుగోపాల్ రెడ్డి, బొప్పాని యాదయ్య, గణేష్, అద్దంకి వెంకన్న, పోతపాక విజయ్ కుమార్, కోటి, విజయ్ రెడ్డి, పరమేష్, ఉపేందర్, రమేష్, వెంకన్న, లచ్చిరెడ్డి, వెంకట్ రెడ్డి, పెరిక శేఖర్, రఫియా, ప్రసన్నకుమార్, అరుణ, లక్ష్మి, శైలజ, రాజేష్, మైల సైదులు, నాగమణి, కరుణ, కళావతి, ఆరీఫా, భారతి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.





# ఏసీబీ వలలో దేవరకొండ విద్యుత్ ఏడీఈ..

- లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డ సైదులు..
- రూ. 30 వేలు స్వాధీనం చేసుకున్న అధికారులు..



**దేవరకొండ, మహా :** నల్గొండ జిల్లా దేవరకొండ విద్యుత్ శాఖ కార్యాలయంలో గురువారం ఏసీబీ అధికారులు నిర్వహించిన మెరుపు దాడి కలకలం రేపింది. ఒక పనికి సంబంధించిన ఫైలును క్లియర్ చేసేందుకు కాంట్రాక్టర్ నుంచి రూ. 30 వేలు లంచం తీసుకుంటూ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఏడీఈ) సైదులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. విద్యుత్ పనులకు సంబంధించిన పెండింగ్ ఫైళ్లను ముందుకు కదిలించేందుకు ఏడీఈ సదరు కాంట్రాక్టర్‌ను నగదు డిమాండ్ చేయడంతో, బాధితుడు అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పక్కా వ్యూహంతో రంగంలోకి దిగిన ఏసీబీ బృందం కార్యాలయంలో బాధితుడి నుంచి సైదులు లంచం తీసుకుంటుండగా అకస్మాత్తుగా దాడి చేసి అదుపులోకి తీసుకుంది. ఆయన వద్ద నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్న అధికారులు చేతులకు రసాయన పరీక్షలు నిర్వహించి లంచం తీసుకున్నట్లు ధ్రువీకరించారు. అనంతరం కార్యాలయంలోని కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్న అధికారులు సోదాలను ముమ్మరం చేశారు. ఏడీఈ నివాసంలోనూ తనిఖీలు చేపట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ ఘటనతో దేవరకొండ ప్రభుత్వ కార్యాలయాల్లో ఒక్కసారిగా కలకలం రేగింది. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు.

## వేసవిలో నీటి ఎద్దడి నివారణకు

# యుద్ధప్రాతిపదికన చర్యలు

### మండల స్థాయి ప్రత్యేక సమావేశంలో అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

**ఆలేరు, మహా:** వేసవిలో గ్రామాలలో నీటి ఎద్దడి నివారణకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులను యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థల ) భాస్కర్ రావు ఆదేశించారు యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం 99 రోజుల ప్రణాళికలో భాగంగా మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులతో ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొన్నారుఈ సమావేశంలో ఏడు అంశాలపై ఏర్పాటు చేసిన మండల సమావేశం ప్రాధాన్యతను ఆయన వివరించారు. అధికారులు బాధ్యతతో వ్యవహరిస్తే ప్రభుత్వ పథకాలు ఆశించిన ఫలితాలను ఇస్తాయని ఆయన చెప్పారు. వ్యవసాయం, విద్యా,వైద్యం,విద్యుత్ తో పాటు వివిధ శాఖల వారీగా సమీక్షలు నిర్వహించారు.అయితే అలైవ్ అరవ్ కార్యక్రమాలలో భాగంగా రోడ్డు ప్రమాదాలను నివారించడానికి డ్రైవింగ్ లైసెన్స్ కలిగి వుండాలని, టూ వీలర్స్ నడిపే ప్రతి ఒక్కరు ఎల్మెట్ ధరించాలని ,త్రిబుల్ డ్రైవ్ చేయరాదని ,మైనర్లకు వాహనాలు ఇవ్వ వద్దనే అంశాలపై గ్రామాలలో సర్పంచ్ లు చైతన్యం చేయాలని ఆలేరు SHO యాలాద్రి సమావేశంలో కోరారు...కాగా గ్రామాలలో



బెల్ట్ షాపులను లేకుండా చేయాలని టంగుటూరు సర్పంచ్ జూకంటి అనిల్ కోరారుమద్యం మత్తులో ప్రమాదాలకు గుర్తై ప్రాణాలు పోగొట్టుకటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు...ఇసుక సరఫర కొత్త అన్ లైన్ పాలసీ తో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు కొంత ఇబ్బంది జరుగుతుందని అనిల్ అధికారుల దృష్టికి తెచ్చారు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ఇసుకు సరఫరాలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని రెవెన్యూ అధికారులను అదనపు కలెక్టర్ సూచించారుఈ సమావేశానికి మండల ప్రత్యేక అధికారి వెంకటరామిరెడ్డి అధ్యక్షత వహించాగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మనోహర్,ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్, తహసీల్దార్ వలిగొండ ఆంజనేయులు, గ్రామాల సర్పంచ్ లు, గ్రామ కార్యదర్శులు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





## ప్రభుత్వ ఆరోగ్య ఉచిత సేవలును

# సద్వినియోగం చేసుకోవాలి

### మున్సిపల్ చైర్మన్ బీజన బాలమణి భాస్కర్

**ఆలేరు, మహా:** ప్రభుత్వ అరోగ్య సేవలను నేతన్నలు సద్వినియోగం చేసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపల్ చైర్మన్ బీజన బాలమణి భాస్కర్ అన్నారుగురువారం ఆలేరు గౌడ సంఘ భవనంలో చేనేత కార్మికులకు "ఆరోగ్య భరోసా" కార్యక్రమం నిర్వహించారు. చేనేత అనగా చేతి మగ్గాల ద్వారా పట్టు దారాలతో వస్త్రాలను నేసే వృత్తి. ఈ వృత్తిని సాంస్కృతిక వారసత్వంగా కొనసాగిస్తున్న చేనేత కార్మికులకు ఆరోగ్య భరోసా కల్పించాలనే లక్ష్యంతో జిల్లా కేంద్రం, ఆరోగ్య శాఖ మరియు జిల్లా హ్యాండ్లూమ్ & టెక్స్టైల్స్ శాఖ, యాదాద్రి భువనగిరి వారి సమన్వయంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సూచనలతో, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గౌడ సంఘ భవనంలో చేనేత కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్సలు మరియు ల్యాబ్ పరీక్షలు చేశారు.అదేవిధంగా, చేనేత కార్మికులకు హెల్త్ కార్డులు పంపిణీ చేసి అవసరమైన మందులు అందించారు. అలాగే ప్రతి కార్మికుడి పూర్తి వైద్య వివరాలు (Medical History) హెల్త్ కార్డులో నమోదు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా చేనేత కార్మికుల ఆరోగ్య స్థితిపై సమగ్ర అవగాహన కల్పించారు కార్యక్రమాన్ని ఆలేరు మున్సిపల్ చైర్‌పర్సన్ బాలమణి భాస్కర్ ప్రారంభించారు మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతు చేనేత కార్మికులు వృత్తిపరంగా అనేక శరీరక సమస్యలు వస్తాయని వీరికోసం మెడికల్ క్యాంపు లు ఏర్పాటు చేయడం సంతోషాకరమణి అన్నారు.జిల్లా వైద్యాధికారి మనోహర్ మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఈ అవకాశాన్ని వినియోగించుకుని చికిత్స తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆంజనేయులు,అదనపు కలెక్టర్ భాస్కరరావు , DRDA PD నాగి రెడ్డి , AD (Handloom & Textiles) శ్రీనివాస్ , YBD జిల్లా ప్రోగ్రాం అధికారులు, మునిసిపల్ కౌన్సిలర్లు మరియు పట్టణ చేనేత సంఘం సభ్యులు , మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్. హైమవతి మెడికల్ ఆఫీసర్, శారాజీపే, మరియు ఇతర ఆరోగ్య సిబ్బంది, ఫీల్డ్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## ప్రభుత్వ ఆరోగ్య ఉచిత సేవలును

# సద్వినియోగం చేసుకోవాలి

### మున్సిపల్ చైర్మన్ బీజన బాలమణి భాస్కర్

**ఆలేరు, మహా:** ప్రభుత్వ అరోగ్య సేవలను నేతన్నలు సద్వినియోగం చేసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపల్ చైర్మన్ బీజన బాలమణి భాస్కర్ అన్నారుగురువారం ఆలేరు గౌడ సంఘ భవనంలో చేనేత కార్మికులకు "ఆరోగ్య భరోసా" కార్యక్రమం నిర్వహించారు. చేనేత అనగా చేతి మగ్గాల ద్వారా పట్టు దారాలతో వస్త్రాలను నేసే వృత్తి. ఈ వృత్తిని సాంస్కృతిక వారసత్వంగా కొనసాగిస్తున్న చేనేత కార్మికులకు ఆరోగ్య భరోసా కల్పించాలనే లక్ష్యంతో జిల్లా కేంద్రం, ఆరోగ్య శాఖ మరియు జిల్లా హ్యాండ్లూమ్ & టెక్స్టైల్స్ శాఖ, యాదాద్రి భువనగిరి వారి సమన్వయంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సూచనలతో, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గౌడ సంఘ భవనంలో చేనేత కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్సలు మరియు ల్యాబ్ పరీక్షలు చేశారు.అదేవిధంగా, చేనేత కార్మికులకు హెల్త్ కార్డులు పంపిణీ చేసి అవసరమైన మందులు అందించారు. అలాగే ప్రతి కార్మికుడి పూర్తి వైద్య వివరాలు (Medical History) హెల్త్ కార్డులో నమోదు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా చేనేత కార్మికుల ఆరోగ్య స్థితిపై సమగ్ర అవగాహన కల్పించారు కార్యక్రమాన్ని ఆలేరు మున్సిపల్ చైర్‌పర్సన్ బాలమణి భాస్కర్ ప్రారంభించారు మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతు చేనేత కార్మికులు వృత్తిపరంగా అనేక శరీరక సమస్యలు వస్తాయని వీరికోసం మెడికల్ క్యాంపు లు ఏర్పాటు చేయడం సంతోషాకరమణి అన్నారు.జిల్లా వైద్యాధికారి మనోహర్ మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఈ అవకాశాన్ని వినియోగించుకుని చికిత్స తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆంజనేయులు,అదనపు కలెక్టర్ భాస్కరరావు , DRDA PD నాగి రెడ్డి , AD (Handloom & Textiles) శ్రీనివాస్ , YBD జిల్లా ప్రోగ్రాం అధికారులు, మునిసిపల్ కౌన్సిలర్లు మరియు పట్టణ చేనేత సంఘం సభ్యులు , మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్. హైమవతి మెడికల్ ఆఫీసర్, శారాజీపే, మరియు ఇతర ఆరోగ్య సిబ్బంది, ఫీల్డ్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు



# అణు విలయానికి కిమ్ జోంగ్ ఉన్ గ్రీన్ సిగ్నల్

- టెల్ అవీవ్ టార్గెట్‌గా ఉత్తర కొరియా అణు క్షిపణులు.. *ట్రంప్ 'హెల్' అల్టిమేటం.. కిమ్ 'న్యూక్లియర్' కౌంటర్
- బటన్ నొక్కడమే ఆలస్యం.. వాషింగ్టన్ భస్మీపటలమే లక్ష్యంగా కిమ్ ఎత్తుగడ
- ఇరాన్ కోసం రణరంగంలోకి ఉత్తర కొరియా
- అణు యుద్ధం ముంగిట ప్రపంచం

**వాషింగ్టన్, మహా:** ప్రపంచ శాంతి ఇప్పుడు ఒక సన్నని దారంపై వేలాడుతోంది. ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన '48 గంటల డెడ్‌లైన్' అంతర్జాతీయ రాజకీయాల్లో దావానలంలా మారింది. హోర్ముజ్ జలసంధిని తెరవకపోతే ఇరాన్‌పై 'నరకపు ద్వారాలు' తెరుస్తామని, ఆ దేశ ఇంధన వనరులను తుడిచిపెట్టేస్తామని ట్రంప్ చేసిన హెచ్చరికలకు ప్రతిస్పందనగా ఉత్తర కొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ ఊహించని రీతిలో రంగంలోకి దిగారు. ఇరాన్ జోలికి వస్తే చూస్తూ ఊరుకోబోమని, అమెరికా తన మొండివైఖరిని వీడకపోతే వాషింగ్టన్ మరియు టెల్ అవీవ్‌లను అణు బాంబులతో స్మశానాలుగా మారుస్తామని కిమ్ చేసిన గర్జనతో ప్రపంచం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఇది కేవలం మాటల యుద్ధం కాదు, అణు వినాశనానికి పిలుపు అని రక్షణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ ఘర్షణ వెనుక నెలల తరబడి సాగుతున్న ఇరాన్‌ఇజ్రాయెల్ యుద్ధం ఉంది. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మరణం తర్వాత ఆ దేశంపై అమెరికా మరియు ఇజ్రాయెల్ ఉమ్మడి దాడులను తీవ్రం చేశాయి. అయితే, ఇరాన్‌ను ఒంటరిని చేయాలని చూస్తున్న అగ్రరాజ్యానికి ఉత్తర కొరియా రూపంలో ఒక పెద్ద అడ్డంకి ఎదురైంది. తన అణు సామర్థ్యమే తనకు రక్షణ కవచమని నమ్మే కిమ్, ఇప్పుడు ఆ అస్త్రాన్ని అమెరికా గుండెకాయ లాంటి వాషింగ్టన్ వైపు, ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవీవ్ వైపు ఎక్కుపెట్టారు. "అమెరికా తన అహంకారంతో ఇరాన్‌పై విరుచుకుపడితే, ప్రపంచం ఎన్నడూ చూడని అణు ప్రళయాన్ని మేం చూపిస్తాం" అని ఉత్తర కొరియా విదేశాంగ శాఖ విడుదల చేసిన ప్రకటన దిల్లీ నుంచి లండన్ వరకు ప్రకంపనలు సృష్టిస్తోంది.మరోవైపు, హోర్ముజ్ జలసంధిలో నెలకొన్న ఉద్రిక్తతల వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఇప్పటికే కుప్పకూలిపోయే స్థితికి చేరింది. చమురు ధరలు ఆకాశాన్ని తాకుతుండటంతో అగ్రరాజ్యం తన సైనిక బలాన్ని ప్రదర్శించి ఇరాన్‌ను లొంగదీసుకోవాలని చూస్తోంది. కానీ, కిమ్ జోంగ్ ఉన్ ఈ వివాదంలో తలదూర్చడం వల్ల ఇది రెండు దేశాల మధ్య యుద్ధంగా కాకుండా, అణు దేశాల మధ్య మహా సంగ్రామంగా మారే ప్రమాదం కనిపిస్తోంది. ఇప్పటికే అమెరికా తన క్షిపణి రక్షణ వ్యవస్థలను మధ్యప్రాచ్యం నుంచి తరలించి అప్రమత్తం చేయగా, ఇటు కిమ్ తన 'హ్వాసోంగ్' క్షిపణులకు సిద్ధం కావాలని ఆదేశాలివ్వడం యుద్ధ మేఘాలు ఎంత దగ్గరగా ఉన్నాయో సూచిస్తోంది. ప్రపంచ దేశాలు ఇప్పుడు రెండు వర్గాలుగా విడిపోతున్నాయి. రష్యా, చైనా వంటి దేశాలు ఉత్తర కొరియా వ్యాఖ్యలపై ఆచితూచి స్పందిస్తుండగా, నాటో దేశాలు మాత్రం కిమ్ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాయి. "నరకపు ద్వారాలు" ఎవరి కోసం తెరుచుకుంటాయో కాలమే నిర్ణయిస్తుందని ఇరాన్ జనరల్స్ ప్రతిసవాల్ విసురుతున్నారు. మరికొద్ది గంటల్లో ట్రంప్ విధించిన గడువు ముగియనుండటంతో, ప్రపంచం ఊపిరి బిగబట్టి ఏం జరుగుతుందోనని ఎదురుచూస్తోంది.




SPONSORED BY:

Sri Chaitanya
INSTITUTE OF TECHNOLOGY & RESEARCH
UGC AUTONOMOUS INSTITUTION
KHAMMAM

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | శుక్రవారం, హైదరాబాద్ | 17-04-2026



# హీరోయిన్ తమన్నాకు బిగ్ షాక్..!

టాలీవుడ్ హీరోయిన్ తమన్నాకు మద్రాస్ హైకోర్ట్ షాకిచ్చింది. కోటి రూపాయల పరిహారం కోరుతూ హైకోర్ర్ట్‌ను ఆశ్రయించగా.. ఆమె పిటిషన్‌ను కొట్టివేసింది. తన ఆరోపణలకు సంబంధించిన సరైన ఆధారాలు లేకపోవడంతోనే తమన్నా పిటిషన్ తిరస్కరిస్తున్నట్లు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మిల్కీ బ్యూటీకి ఉన్నత న్యాయస్థానంలో చుక్కెదురైంది. పవర్ సోప్స్ అనే సంస్థతో 2008లో తమన్నా ఒప్పందం చేసుకుంది. 2009 అక్టోబర్ వరకు మాత్రమే తమన్నాతో పవర్ సోప్స్‌కు అగ్రిమెంట్ కుదిరింది. కానీ గడువు ముగిసినా 2010, 2011లో కూడా ఆ సంస్థ తన ఉత్పత్తులతో పాటు ప్రకటనల్లో మిల్కీ బ్యూటీ ఫోటోలను వినియోగించింది. దీంతో ఒప్పందం అయిపోయినా కూడా తన ఫోటోలను ప్రకటనల్లో వాడారని ఆరోపిస్తూ తమన్నా ఇటీవలే మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. తాజాగా తమన్నా పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది. సరైన ఆధారాలు లేకపోవడంతో తమన్నా పిటిషన్‌ను హైకోర్ట్ తిరస్కరించింది.



# ‘సౌత్ డైరెక్టర్‌తో ఆడిషన్.. ఏకంగా నా చేయి పట్టుకుని..’

సినీ ఇండస్ట్రీలో క్యాస్టింగ్ కౌచ్ అనే పదం కొత్త కాదు. ఇండస్ట్రీలోకి వచ్చినవారిలో చాలామందికి దాదాపు ఇలాంటి అనుభవం ఎదురయ్యే ఉంటుంది. ఈ విషయాన్ని కొందరు హీరోయిన్స్ బయటికి చెబుతుంటారు. మరికొందరు తమ బాధను చెప్పేందుకు భయపడుతూ ఉంటారు. ఏదేమైనా సినిమా ఇండస్ట్రీలో క్యాస్టింగ్ కౌచ్ సర్వ సాధారణమైపోయింది. తాజాగా మరో హీరోయిన్ తనకెదురైన క్యాస్టింగ్ కౌచ్ అనుభవాన్ని పంచుకుంది. బాలీవుడ్ బ్యూటీ డైసీ షా తాను ఎదుర్కొన్న సంఘటనను వివరించింది. తాజాగా ఓ ఇంటర్వ్యూకు హాజరైన ముద్దుగుమ్మ.. దక్షిణాది డైరెక్టర్ తనతో అసభ్యంగా ప్రవర్తించాడని తెలిపింది. కాస్టింగ్ సెషన్ జరుగుతున్నప్పుడు.. అనుచితంగా తన శరీరాన్ని తాకాడని వెల్లడించింది. ఆ సమయంలో తాను చాలా ఇబ్బందికి గురయ్యానని పేర్కొంది. ముంబయిలో జరిగిన క్యాస్టింగ్ మీట్‌లో ఈ సంఘటన జరిగిందని పంచుకుంది. డైసీ షా మాట్లాడుతూ..'దక్షిణాదికి చెందిన ఒక డైరెక్టర్ నన్ను చాలా అసభ్యంగా తాకారు. ఆయన కాస్టింగ్ కోసం ఓసారి ముంబైకి వచ్చారు. అతన్ని కలవడానికి ఆరు నుంచి ఏడుగురు అమ్మాయిలం వెళ్లాం. అక్కడ ఆయన మమ్మల్ని ఒక్కొక్కరిని విడివిడిగా కలుస్తున్నారు. అది నాకు నచ్చలేదు. ఆ సమయంలో నా శరీరాన్ని తాకారు.. నా చేయి కూడా పట్టుకున్నారు. నన్ను ఎవరైనా తాకితే చాలా భయంగా ఉంటుంది. అందుకే నేను మసాజ్ కూడా చేయించుకోను. ఒక మహిళ కూడా నన్ను తాకడం ఇష్టం లేదు. అదే ఒక పురుషుడు నన్ను తాకితే ఎలా ఉంటుంది. అందుకే నాకు అది నచ్చలేదు. ఆ తర్వాత అతనికి తిరిగి ఫోన్ చేస్తానని చెప్పా. కానీ చేయలేదు' అని వెల్లడించింది. అయితే ఆ డైరెక్టర్ ఎవరనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. కాగా.. డైసీ షా.. సల్మాన్ ఖాన్ సరసన 'జై హో' (2014) చిత్రంతో బాలీవుడ్‌లో అరంగేట్రం చేసింది. ఆ తర్వాత 'హేట్ స్టోరీ 3' (2015)లో కనిపించింది. మొదట కొరియోగ్రాఫర్ గణేష్ ఆచార్య వద్ద సహాయకురాలిగా తన కెరీర్‌ను ప్రారంభించింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com